


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 126 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 18 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 126 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 18 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

- దేశంలో నిరుద్యోగ సమస్యపై కీలక నివేదిక రిలీజ్
- పట్టభద్రులు చదువు పూర్తైన వెంటనే ఉద్యోగం పొందలేకపోతున్నారని వెల్లడి
- "గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది.

మిగతా2లో



## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడీ.. కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా?

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారు
- తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారు
- 'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి
- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్ పెన్ పవర్:**మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై శాసనమండలిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. డ్రగ్స్ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారని మహేష్ గౌడ్ అన్నారు. 'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు.

- మిగతా2లో



## ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- పశ్చిమాసియా సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గం: భారత్
- ఈయూ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని చెప్పిన అధికార ప్రతినిధి
- దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎక్కడా కొరత లేదని కేంద్ర స్పష్టం

మిగతా2లో

# నివురుగప్పిన నిప్పులా కాంగ్రెస్

- ఎన్నికలు దగ్గర పడే సమయంలో అది మరింత బయటపడే అవకాశముందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి
- ప్రస్తుతం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అప్పర్ హ్యాండ్‌గానే ఉంది
- ఎన్ని ప్రచారాలు జరిగినప్పటికీ రేవంత్ రెడ్డి విషయంలో ఢిల్లీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంది
- రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కూడా సీనియర్ నేతల్లో అసంతృప్తి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది



**హైదరాబాద్ పెన్ పవర్:**

తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృప్తి అనేది బయటపడకుండా ఉంది. అయితే ఎన్నికలు దగ్గర పడే సమయంలో అది మరింత బ యటపడే అవకాశముందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అప్పర్ హ్యాండ్ గానే ఉంది. ఢిల్లీ హైకమాండ్ వద్ద కూడా ఆయనకు తిరుగులేదు. ఎన్ని ప్రచారాలు జరిగినప్పటికీ రేవంత్ రెడ్డి విషయంలో ఢిల్లీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కూడా సీనియర్ నేతల్లో అసంతృప్తి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది.

- మిగతా2లో

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

- పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదు
- ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారు



మిగతా2లో



## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

- కాబుల్ దాడిని ఖండించిన భారత్
- మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శ
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్

మిగతా2లో

## 'ఆ నిబంధన సరికాదు'

- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే ఎక్కువగా ఉంటే ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని సుప్రీం వ్యాఖ్య
- పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

2



# బీజేపీ కార్యకర్తలపై వరుస దాడులు



- బీజేపీకి రాంచందర్ రావు ఫిర్యాదు
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేకనే కక్షపూరితంగా దాడులకు దిగుతున్నారు
- పోటీ చేయవద్దని హెచ్చరించినా ధైర్యంగా నిలబడిన బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో బీజేపీ కార్యకర్తలపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు నేడు డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. పోలీస్ యంత్రాంగం అధికార పక్షానికి కొమ్ముకాస్తోందని ఆరోపిస్తూ ఆయన డీజీపీకి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేకనే కక్షపూరితంగా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. పోటీ చేయవద్దని హెచ్చరించినా ధైర్యంగా నిలబడిన బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సాక్షాత్తూ పోలీసులే దాడులకు పాల్పడటం దారుణమని ధ్వజమెత్తారు. గతంలో నల్గొండ ఎస్పీ, నిన్న

- మిగతా2లో



## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

- భవానీపూర్ బరిలో మమత-సువేందుతో మళ్లీ ఢీ
- ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దు
- జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోంది
- అభ్యర్థుల జాబితా విడుదల వేళ సీఎం మమత వ్యాఖ్యలు

మిగతా2లో


# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్

- నిందితులను కస్టడీకి కోరుతూ పిటిషన్
- మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సిట్ ఏర్పాటు
- సీపీ సుధీర్‌బాబు పర్యవేక్షణలో విచారణ చేయనున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- రోహిత్‌రెడ్డి సోదరుడు రితేశ్‌రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సిట్ సిఫారసు

**హైదరాబాద్ పెన్ పవర్:**

మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును విచారణ చేయడానికి 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేయనున్నట్లు తెలిపింది. 3 నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశాలు జారీ చేసింది. పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేశ్‌రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సిట్ సిఫారసు చేసింది. ఫామ్‌హౌస్‌లో సోదాలకు వెళ్లిన పోలీసులపై

- మిగతా2లో






## చేతివృత్తులకు చేయూత ఏది?

తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల మంది చేతివృత్తులు చేస్తున్నారు. ప్రధానంగా బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు ఈ వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరి వృత్తిలో ఆధునీకరణ తీసుకురావడం, ఉపాధి మెరుగుపరచడం కోసం రాష్ట్రంలో వృత్తుల ప్రాతిపదికన పదకొండు కార్పొరేషన్‌లు, ఫెడరేషన్‌లు కల్లుగీత, రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, మేదర, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి, ఉప్పర, కృష్ణబలిజ, వాల్మీకి బోయ, బట్రాజతో పాటు సంచార జాతుల వారికి ఎంబీసీ కార్పొరేషన్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కుల ప్రాతిపదికన మరొక తొమ్మిది కార్పొరేషన్లు పెరిక, ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, పద్మశాలి, మేర గంగపుత్ర, లింగాయత్, ఈ బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. జాతీయస్థాయిలో ఫిషరీస్, గొర్రెలు మేకల పెంపకం, చేనేత సహకార ఫెడరేషన్‌లు ఉన్నాయి. వీటిని ఏ ఉద్దేశం, లక్ష్యంతో ఏర్పాటు చేశారో అది మాత్రం ఆచరణలో అమలు కావడం లేదు. ఎన్నికల సందర్భంగా ఈ తరగతి ప్రజలను ఆకట్టుకోవడానికి మాత్రం రాజకీయ పార్టీలకు బాగా ఉపయోగపడుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసింది. కానీ, ఏ ఒక్కటి నెరవేర్చలేదు. 2025-26 రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 కోట్లలో కల్లుగీత సహకార సంస్థకు 68 కోట్లు, మిగతా 19 సహకార సంస్థలకు 50 కోట్ల చొప్పున కేవలం 1018 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్ కు 400 కోట్లు మాత్రమే కేటాయించింది. నామమాత్రపు బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నది. ఆ కేటాయించిన నిధులు కూడా ఖర్చు చేయడం లేదు.వృత్తిదారుల ఉపాధి మెరుగుపరుచుటకు, అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు.

ఇటీవల వృత్తి సంఘాల నేతలం రాష్ట్ర కార్పొరేషన్‌లు, ఫెడరేషన్‌లు సందర్శించాం. ఒక్క కల్లుగీత కార్పొరేషన్‌కు మాత్రమే 17 కోట్లు విడుదలైనట్లు తెలిసింది. మిగతా 51 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మిగతా సంస్థలకు ఇప్పటివరకు రూపాయి కూడా రాలేదు. మరొక 15 రోజులలో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. బడ్జెట్ కేటాయింపులే తక్కువ చేశారు. అవి కూడా ఖర్చు చేయకపోవడం చూస్తే వృత్తిదారుల పట్ల ప్రభుత్వ వైఖరి అర్థం చేసుకోవచ్చు. డబ్బులు లేకపోవడంతో ఆఫీసులో సిబ్బంది ప్రభుత్వ ఖజానా వైపు ఎదురుచూస్తున్నారు. ఎంతో కొంత ఏమైనా సహకారం అందుతుందేమోనని ఆఫీసుల చుట్టూ వృత్తిదారులు తిరుగుతున్నారు. ఉత్పత్తి వృత్తులు చేసేవారు నేత, గీత, మత్స్య, గొర్రెలు మేకలు పెంపకం, ఇనుము, కలప, ఇత్తడి, బంగారం, అల్లికలు, దూదేకుట, రాళ్లు కొట్టడం, కుండలు, మేదర, టైలరింగ్ ఉన్నారు. సేవా వృత్తులు చేసేవారు రజక, క్షౌర, సాంస్కృతిక వృత్తులు చేసేవారు ఒగ్గు కథ, మంద హెచ్చులు, దుబ్బుల కొలుపు, వాయిద్య కళాకారులు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏసూటి, సంచార జాతులు ఎంబీసీలు తదితరులు నేటికి గణీనీయమైన సంఖ్యలో ఉన్నారు. వృత్తుల్లోకి బడా పెట్టుబడిదారులు ప్రవేశించడంతో వ్యాపారంగా మారి వృత్తిదారులు వారి కింద జీతాలు తీసుకొని పనిచేసే కార్మికులుగా మారిపోతున్నారు. చేనేత, స్వర్ణకారులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు.

లిక్కర్ శీతల పానీయాల దాటికి కల్లుగీత వృత్తి మరింతగా దెబ్బతింటున్నది. రజక, క్షౌర లాంటి సేవావృత్తులు యాంత్రీకరణ వల్ల ఆదాయం కోల్పోతున్నారు. పెత్తందారుల చేత కులవివక్ష, అవమానాలు, సాంఘీక బహిష్కరణలకు, దాడులు, దౌర్జన్యాలకు, హత్యలకు గురవుతున్నారు. మత్స్య సంపద రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన చెరువులు, కుంటలు, జలవనరులు కబ్జాలు కాలుష్యానికి గురవుతున్నాయి. గొర్రెలు, మేకలు పెంపకం వృత్తిలోకి పెట్టుబడిదారులు ప్రవేశిస్తున్నారు. వైద్యం, మేత సరిపడా ప్రభుత్వం అందించలేకపోతుంది. వడ్డెర, వడ్రంగి, ఇనుము పని, బంగారం, ఇత్తడి, శిల్పాలు చెక్కుట, దూదేకుల, కుమ్మరి, దాసరి, సగర, ఉప్పర, బట్రాజులు, బోయ, పూసల, మేదర, టైలర్ వీరితో పాటు బ్యాండు, వాయిద్య, ఒగ్గు, మంద హెచ్చుల, దుబ్బుల కొలుపు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏనూటి తదితర సాంస్కృతిక వృత్తులవారు వృత్తిలో బతకలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో కేటాయింపులు చేసి ఆచరణలో ఖర్చు చేయడం లేదు. ఆ సంవత్సరం ఖర్చు కాకపోతే తదుపరి బడ్జెట్‌లో వాటిని కలిపి ఖర్చు చేసే విధంగా బీసీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలి. వృత్తి చేసేవారి ఉపాధి భద్రతకు, సామాజిక రక్షణకు, చిత్తశుద్ధితో పని చేయాలి. 2026-27 బడ్జెట్‌లో 25 వేల కోట్లు కేటాయించాలి. వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ వర్గీకరించి అమలు చేయాలి.

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

రైల్వే ఉద్యోగుల ప్రమోషన్ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైల్వే శాఖపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పరీక్షలను కన్నడ భాషలో రాసేందుకు అవకాశం కల్పించకపోవడంతో కన్నడ సంఘాలు నిరసన చేపట్టాయి. దీంతో రైల్వే శాఖ హఠాత్తుగా పరీక్షలను రద్దు చేసింది. ఈ చర్యను సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో, నైరుతి రైల్వే పరిధిలో 194 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు, హుబ్బళ్లి డివిజన్‌లో 101 ఎల్‌డీసీఈ పోస్టుల ప్రమోషన్ల కోసం జరగాల్సిన పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేశారని తెలిపారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. నిరసనలు ఉధృతమయ్యాక హడావుడిగా పరీక్షను రద్దు చేయడం ఖండనీయమని పేర్కొన్నారు. "మొదట్లోనే ఈ సమస్యను గుర్తించి, కన్నడలో పరీక్షకు అనుమతి ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రైల్వే శాఖ కన్నడ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది," అని ఆయన విమర్శించారు. కర్ణాటకకు చెందిన వి. సోమన్న రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని సిద్ధరామయ్య అన్నారు.

## బీజేపీ కార్యకర్తలపై వరుస దాడులు

-మొదటిపేజీ తరువాయి

పరిగి సీఐ బీజేపీ కార్యకర్తలపై భౌతిక దాడులు చేసిన ఘటనలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. హోం శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అరాచకాలపై తక్షణమే స్పందించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. పోలీస్ శాఖ అంతా కాంగ్రెస్ కార్యకర్తల విభాగంలా మారిపోయిందని ఆయన ఘాటుగా విమర్శించారు. అయితే, రాష్ట్ర డీజీపీ తమ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందిస్తూ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఒకవేళ విచారణలో న్యాయం జరగకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకత్వానికి ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్

-మొదటిపేజీ తరువాయి

రియల్టర్ నమిత్ శర్మ, రితేశ్ రెడ్డి లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో కాల్పులు జరిపాడు. తుపాకీ లైసెన్స్ దుర్వినియోగం చేశారని సిట్ అధికారులు సీపీకి లేఖ రాశారు. మరోవైపు ముగ్గురు నిందితులను 7 రోజులు కస్టడీకి కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఫాంహౌస్‌లో ఈ నెల 14న (శనివారం) రాత్రి జరిగిన విందుపై తెలంగాణ ఈగల్, మొయినాబాద్ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను రిమాండ్?కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా బీఆర్?ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఈ డ్రగ్స్, మద్యం పార్టీకి ప్రధాన సూత్రధారిగా తేలింది. కొన్నిరోజులుగా రోహిత్‌రెడ్డి తన ఫాంహౌస్‌లో వారాంతపు పార్టీ చేద్దామనే గట్టి ఆలోచనలో ఉన్నాడు. ఈ క్రమంలో ఆయన స్నేహితుడు, బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి బిజినెస్ మీటింగ్?లో భాగంగా శిమ్లా వెళ్లినప్పుడు ఓ వ్యక్తి దగ్గర రూ.15 వేలకు కొకైన్‌ను కొనుగోలు చేశాడు.

### పార్టీలో మొత్తం 11 మంది

ఈ విషయం పైలట్ రోహిత్ రెడ్డితో చెప్పగా ఈ నెల 14న సాయంత్రం తన ఫాంహౌస్‌లో పార్టీ చేద్దామనే ఆలోచనకు వచ్చి నిర్ణయించుకున్నాడు. దీనికి తన స్నేహితుడు ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్?తో సహా ఇతరుల్ని ఆహ్వానించాడు. కౌశిక్ రవి డ్రగ్స్‌తో నేరుగా ఫాంహౌస్?లో జరిగే పార్టీకి వచ్చాడు. మొత్తం 11 మంది పాల్గొన్న పార్టీలో మహేశ్ కుమార్, రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి, నమిత్ శర్మ తదితరులంతా మద్యంలో కొకైన్(డ్రగ్స్) కలిపి సేవించారు.

### గన్‌తో శర్మ కాల్పులు

ఈ ఫాంహౌస్‌లో మద్యం, డ్రగ్స్ పార్టీ కేసులో ఒక్కొక్కటిగా సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఫాంహౌస్‌లోకి పోలీసులు రావడాన్ని చూసిన నమిత్‌శర్మ తప్పించుకొని పారిపోవాలనే ఉద్దేశంతోనే గన్?తో కాల్పులు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు ఫాంహౌస్‌లోకి ప్రవేశించే సమయంలోనే తుపాకీ కాల్పుల శబ్దం వినిపించింది. దీంతో తాము ఫ్యూచర్‌సిటీ పోలీసులమని, పక్కా సమాచారంతో సోదాలకు వచ్చామంటూ వారు గట్టిగా చెప్పారు. దీన్ని లెక్క చేయకుండా నమిత్ పోలీసు అధికారిని టార్గెట్‌గా చేసుకుని ఒక రౌండు కాల్పులు జరిపాడు. పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి ఇద్దరూ వాళ్లను కాల్చెయ్, తర్వాత మొత్తం మేం చూసుకుంటాం అంటూ నమిత్ శర్మను రెచ్చ గొట్టినట్లు సమాచారాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు అప్రమత్తతతో అందర్నీ చుట్టుముట్టడంతో తుపాకీ కాల్పులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలోనే పైలట్ రోహిత్‌రెడ్డి, నమిత్ శర్మ, రితేశ్ రెడ్డిపై కొత్తగా అటెంప్ట్? టు మర్డర్? సెక్షన్లను జోడించారు. ప్రస్తుతం ఈ ముగ్గురు నిందితులు చంచల్‌గూడ జైలు రిమాండ్?లో ఉన్నారు.

## నివురుగప్పిన నిప్పులా కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

కానీ అది బయట పడేంత మాత్రం లేవన్నది వాస్తవం. ఎందుకంటే రేవంత్ రెడ్డిని ఎదిరించి ఇప్పుడు సాధించేదేమీ ఉండదని అందరికీ తెలుసు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు ఇక పార్టీ నుంచి సర్దేసుకుంటు న్నప్పటికీ, చాలా మంది అసంతృప్తి నేతలు తమకు భవిష్యత్ లోనూ పదవులు రావన్న ఆందోళనలో ఉన్నారు. రేవంత్ రెడ్డి ఒంటిచేత్తో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారు. అందులో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ను పదేళ్ల పాటు ప్రజలు కాదన్నప్పటికీ రేవంత్ రెడ్డి వ్యూహాలు, అనుసరించిన విధానాలతోనే పార్టీ అధికారంలోకి వచ్చింది. అయినా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నేతగా చూసేందుకు కొందరు ఇష్టపడకపోవడంతోనే ఈ సమస్య ఉందని చెబుతున్నారు. అయితే అది కాంగ్రెస్ పార్టీ. ప్రజాస్వామ్యం పాళ్లు చాలా ఎక్కువ. ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీ అయిన బీజేపీ తరహా లాంటిది కాదు. ఎవరి లాబీయింగ్ వారికి ఉంటుంది. ఢిల్లీ స్థాయిలో అందరికీ సంబంధాలున్నాయి. అయితే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్లు కూడా సమయం కోసం వేచి చూస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అయితే సీనియర్ నేతలను కలుపుకుని వెళుతూనే తాను అనుకున్నది చేసుకుంటూ వెళుతుండటంతో ఇప్పటి వరకూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నేతలు ఇక ఊరికే ఉండరని, చికాకు తెప్పించడం ఖాయమన్న కామెంట్స్ సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. మరి పదేళ్ల పాటు అధికారం తమదేనంటున్న రేవంత్ రెడ్డి నేతలను ఎలా కంట్రోల్ లో పెడతారో చూడాలి.

## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టెటెఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపుర్ సీటును ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు.

### "ఈసీ పావులు కదిపినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయింది"

బీజేపీ పాలనా వైఫల్యం వల్లే భారతదేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ సంక్షోభం ఏర్పడిందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దని బీజేపీకి ఆమె సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బంగాల్‌లో చాలా తెలివిగా పావులు కదిపిందని, అయినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయిందని మమత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయన్నారు. ఇది బంగాల్ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నిక అని, ఇందులో దిల్లీ లడ్డూ గెలవదని, బంగాలే గెలుస్తుందని దీదీ విశ్వాసం వెలిబుచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ఆమె తెలిపారు.

### "ఏదైనా జరిగితే, నిందలు నాపై మోపొద్దు"

"నా సర్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. ఒకవేళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వస్తే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? ఒకవేళ శాంతిభద్రతల సమస్య తలెత్తితే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? నా ప్రభుత్వంలోని అధికారులంతా బంగాలీలే, చివరకు వాళ్లను కూడా తొలగించారు. ఇక వినీత్ కుమార్, మురళీధర్ లాంటి బంగాలీయేతర అధికారులను సైతం లాక్కున్నారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించారు. వాళ్ల బాధ్యతను ఎవరు తీసుకుంటారు? బయటి వాళ్లు బంగాల్‌లో ఉన్నారు. వాళ్ల దగ్గర డబ్బులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ ఏదైన జరిగితే, నిందలు నాపై మోపొద్దు" అని సీఎం మమత వ్యాఖ్యానించారు.

## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పుని పేర్కొంది.

అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్గాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. అఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్? తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో అఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్? సంఘీభావంగా నిలుస్తుంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మా పూర్తి మద్దతును ఇస్తున్నాం."

### ఐక్యరాజ్య సమితి వేదికపై పాక్‌కు భారత్ కౌంటర్?

పవిత్ర రంజాన్ మాసంలో అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై భారత్? తీవ్రంగా ఖండించింది.

అలాగే అఫ్గాన్ జాతీయులను తరలించడంపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని పాక్ తీరును ఎండగట్టారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఇస్లామోఫోబియాను ఎదుర్కొనే అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు.

## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

దేశంలో నిరుద్యోగంపై కీలక నివేదిక వెలువడింది. భారత్‌లో 20-29 ఏళ్ల మధ్య వయసున్న 63 మిలియన్ల మంది పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు తేలింది. ఈ పట్టభద్రుల్లో ఏడు శాతం మందే గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' పేరిట తాజాగా నివేదిక విడుదల చేసింది.

### 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక ప్రకారం

పట్టభద్రుల్లో నిరుద్యోగం అధికంగానే ఉంది. 15-25 ఏళ్ల మధ్య వయసు వారిలో దాదాపు 40 శాతం, 25- 29 ఏళ్ల మధ్య వయసు వారిలో 20 శాతంగా నిరుద్యోగం ఉంది. తమ గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు అతి కొద్ది మంది మాత్రమే స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో పట్టభద్రుల జనాభా పెరగడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైంది.

### 'పట్టభద్రుల సంఖ్య పెరిగింది'

"గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే ఉన్నత విద్యనభ్యసించేవారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో యువ పట్టభద్రుల సంఖ్యలో కూడా పెరుగుదల కనిపించింది. 2023 నాటికి 20- 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 63 మిలియన్ల పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యా అంతరాలను పూడ్చడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ఉన్నత విద్యలో మొత్తం నమోదు నిష్పత్తులు దేశ అభివృద్ధి స్థాయికి అనుగుణంగా ఉన్నాయి. లింగ, కుల ప్రాతిపదికన విద్యను పొందడంలో ఉన్న సామాజిక, ఆర్థిక అడ్డంకులు తగ్గాయి. దాని ఫలితంగా భారత్‌లో కార్మిక మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న శ్రామిక శక్తి మరింత సమర్థవంతంగా ఉంది" అని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదికలో పేర్కొంది.

## 'ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు'

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్? నేతల ఆహ్వానం మేరకు బ్రస్సెల్‌లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రస్సెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్-ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్?తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. అటు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో పర్యటించారు. బ్రస్సెల్స్‌లో పర్యటనను విజయవంతంగా ముగించానంటూ ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల మండలి సమావేశం, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో భేటీ, ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో చర్చలు జరిగాయి. ఈయూ ప్రతినిధులను కూడా కలుసుకుని పలువురితో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపాము." అని పోస్ట్ చేశారు.

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడీ.. కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా?

-మొదటిపేజీ తరువాయి

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. డ్రగ్స్ కు మేం వ్యతిరేకంగా అని చెప్పేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్ట్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూడా డ్రగ్స్ పరీక్షలకు వస్తారు. మరి బీఆర్‌ఎస్ నేతలు డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా?. బీఆర్‌ఎస్ సభ్యులు తమ నాయకులైన ప్రతిపక్షనేత కేసీఆర్, కేటీఆర్‌లను కూడా డ్రగ్ టెస్టుకు తీసుకురాగలరా' అని మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు.డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, తప్పు చేయని వారు భయపడాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసును అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్న బీఆర్‌ఎస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ సవాళు ,, ప్రతిసవాళ్లతో శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ నేతల మధ్య మొదలైన ఈ 'డ్రగ్ టెస్ట్' వార్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ డ్రగ్స్ టెస్టుకు ఎవరు వస్తారో, ఎవరు డుమ్మా కొడతారని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బీఆర్‌ఎస్ అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని, ఈ కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నివేదిక సంతృప్తికరంగా లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, తుది నిర్ణయం వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. రాజకీయ వర్గాల్లో ఈ నిర్ణయం సంచలనం సృష్టిస్తోంది.ం

## 'ఆ నిబంధన సరికాదు'

చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నండూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్?పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది.అయితే, 1961 నాటి మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఇంకా ఈ చట్టం ప్రకారం అర్హులైన మహిళలకు 26 వారాలు వేతనంతో కూడిన సెలవుకు హక్కు కల్పిస్తుంది. ఇది ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాలకు వర్తిస్తుంది. పితృత్వ సెలవుపై ప్రైవేట్ రంగానికి సంబంధించి ఎలాంటి చట్టం లేకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల వేతనంతో కూడిన పితృత్వ సెలవుకు అర్హత ఉంది. ఒకవేళ ప్రైవేట్ రంగ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని పొందడానికి సరైన నిబంధనలు లేవు.




కళ్ళెదుట ఉన్న రేషన్ బియ్యం పంపిణీ చేయలేరు.. రేషన్ తీసుకోవడానికి కార్డుదారులు సిద్ధంగా ఉన్నా, నిబంధనలు ఒప్పుకోవు.. "ఈ-పాస్" యంత్రం నిర్ణీత తేదీ, సమయం తర్వాత అసలు పనిచేయదని డీలర్‌లు వాపోతున్నారు.. అది ప్రభుత్వ నిబంధనే అయినప్పటికీ.. బియ్యం ఆలస్యం ఎవరి తప్పు..? గోదాముల నుండి రేషన్ పంపిణీ చేయకపోవడం వల్లనే కదా, రేషన్ డీలర్ బియ్యం ఇవ్వలేక పోయారంటూ ఆరోపణలు వస్తున్నాయి.. సంబంధిత అధికారుల, సమాధానం కూడా పొంతన లేకుండా ఉంది.. బాలానగర్ సివిల్ సప్లై పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో రేషన్ బియ్యం పంపిణీలో చోటుచేసుకున్న ఈ విపత్కర పరిస్థితిపై "పెన్ పవర్" ప్రత్యేక కథనం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 17:**

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# పంపిణీకి 'సమయం' లేదు..!

# పైనుండి 'పర్మిషన్' లేదు..!

తెలంగాణలో పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం, పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన "ఈ-పాస్" విధానం బాగానే ఉన్నప్పటికీ..! దీంతో తోపాటు, ప్రతినెలా నిర్ణీత తేదీలోపు మాత్రమే బియ్యం పంపిణి చేయాలన్న నిబంధన ఈసారి బెడిసి కొట్టిందని చెప్పాలి.. బియ్యం కొరత ఏంటి..? పంపిణీకి ఆలస్యం ఏంటి..? అసలు ఏం జరిగిందో చూద్దాం.. డీలర్‌లకు చేరాల్సిన రేషన్ బియ్యం ఇంకా చేరలేదని, కొందరు కార్డుదారులు అడిగే ప్రశ్నలకు తమవద్ద సమాధానం లేదని పలువురు డీలర్‌లు పేర్కొన్నారు.. దీంతో సంబంధిత ముగ్గురు అధికారుల వివరణకై పెన్ పవర్ ప్రతినిధి ఫోన్ ద్వారా తెలుసుకున్న సమాచారానికి, పొంతన లేకుండా ఉండటం విశేషం.. బాలానగర్ ఏఎస్ఓ, హాఫీజ్‌పేట్ గోదాముల ఇంచార్జ్, కూడా, కొరత కారణంగానే ఆలస్యం అయిందనే సమాధానం ఒకే విధంగా ఉన్నప్పటికీ..! మేడ్చల్ జిల్లా మేనేజర్ మాత్రం బియ్యం కొరత లేదు, ఆలస్యం లేదని సరైన సమయానికే ఇచ్చామని చెప్పడం గమనార్హం.. మంగళవారం రాత్రి వరకు బియ్యం వస్తే..! మరుసటి రోజు బియ్యం పంపిణీ సాధ్యపడదని, తాము ఏం చేయాలనే డీలర్‌లు అడిగిన విషయాన్ని సివిల్ సప్లై మేడ్చల్ జిల్లా మేనేజర్‌తో ప్రస్తావించగా, అదేమి లేదు, మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు బియ్యం డీలర్‌లకు అన్‌లోడ్ అవుతాయని, రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయవచ్చని సులభంగా సమాధానమిచ్చారు..

### ఆందోళనలో రేషన్ డీలర్‌లు..! అయోమయంలో కార్డుదారులు..!

- కుత్బుల్లాపూర్ పరిధిలో 108 రేషన్ షాపుల కుగాను 29 షాపులకు బియ్యం పెండింగ్..
- కొరత కారణంగా గోదాములకు ఆలస్యంగా మంగళవారం చేరుకున్న బియ్యం..
- సాయంత్రానికి రేషన్ షాపులకు బియ్యం చేరాలని ప్రభుత్వ ఆదేశాలు:ఏఎస్ఓ..
- అసలు కొరతే లేదంటున్న మేడ్చల్ జిల్లా మేనేజర్ (డి.ఎం)మరి ఇదేంటొ..?
- ఉన్నంతవరకు 29 షాపులకు సమానంగా పంపిణీ చేస్తామంటున్న గోడౌన్ ఇంచార్జ్..
- రేషన్ బియ్యం కొరతతో.. పోర్టబులిటి బియ్యం చివరి రోజు మంగళవారం సప్లై..




మంగళవారం హాఫీజ్‌పేట్‌లో లోడుచేసి పక్కకు పెట్టిన రేషన్ బియ్యం లారీ..

పెన్ పవర్ EXCLUSIVE ప్రత్యేకం

### కళ్ళెదుటే బియ్యం..! పంపిణీకి అవకాశం లేదు..

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బియ్యం కొరత కారణంగా మంగళవారం ఉదయం ఆలస్యంగా గోదాములకు చేరుకున్నప్పటికీ..!రేషన్ బియ్యం పంపిణీకి 17వ తేది చివరి రోజు అయినందున.. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రానికి డీలర్‌లకు రేషన్ బియ్యం చేర్చాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నట్టు బాలానగర్ ఏఎస్ఓ తెలిపారు.. హాఫీజ్‌పేట్ గోదాముల ఇంచార్జ్ అధికారి కూడా కొరత విషయాన్నే ప్రస్తావించారు.. ఈ కొరతతో పూర్తి స్థాయి బియ్యం రాలేదని, ఉదయం వచ్చిన సుమారు 200 టన్నుల బియ్యం వివిధ షాపులకు సమానంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.. అయితే 17వ తేదీనాటికే బియ్యం పంపిణీకి చివరితేది.. డీలర్‌కు రేషన్ బియ్యం పంపిస్తే తాము, కార్డుదారులకు పంపిణీ చేసేది ఎప్పుడని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. రేషన్ బియ్యం కళ్ళెదుటే ఉన్నా పంపిణీ చేయలేరని స్పష్టమవుతుంది.. పైనుండి పర్మిషన్ ఉంటేనే సాధ్యమవుతుందని డీలర్‌ల వాదన.. రేషన్ బియ్యం పంపిణీకి నిన్నటికే (మంగళవారం) చివరి రోజు.. నేటినుండి (బుధవారం) బియ్యం పంపిణీ చేయడానికి "ఈ-పాస్" యంత్రాలు పనిచేయవు.. రేపు (గురువారం) ఉగాది పండుగ (తెలుగు సంవత్సరం) పేదలకు పంపిణీ చేసే ఈ సన్న బియ్యం పండుగపూట అవసరమైన వాళు ళ్ళ అనేక మంది ఉంటారు.. ఈ రేషన్ బియ్యం ఆలస్యాన్ని ముందస్తుగానే గుర్తించిన డీలర్ అసోసియేషన్ సభ్యులు, రేషన్ పంపిణీ నిమిత్తం 3-4 రోజులు పడగించాలని పర్మిషన్ కోసం, ఇప్పటికే ఆశాఖ కమిషనర్‌కి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు..



హాఫీజ్‌పేట్ గోదాములో మంగళవారం రేషన్ బియ్యం లోడ్ అవుతున్న దృశ్యం..

### పోర్టబులిటి కార్డుల బియ్యం తోనే ఈ సమస్య..

సివిల్ సప్లై అధికారుల వాదన మరోరకంగా ఉంది.. ఇవ్వాల్సిన బియ్యం సప్లై 100 శాతం పూర్తైందని, ఇది పోర్టబులిటి బియ్యం కోటాగా అధికారులు చెబుతున్నారు.. తెలంగాణలో ఎక్కడైనా ఎప్పుడైనా రేషన్ కార్డుతో బియ్యం పొందవచ్చనే నిబంధనలు, ఉన్నాయి.. ఈ పంచాయితీకి అసలు కారణం కూడా ఈ పోర్టబులిటి విధానమేనని స్పష్టమవుతుంది.. పోర్టబులిటి కార్డుకు ఫలానా రోజు పంపిణీ, నిబంధనలు ఏమి లేదని.. స్థానికులకు బియ్యం పంపిణీ సమయంలోనే, పోర్టబులిటి కార్డులకు కూడా బియ్యం పంపిణీ చేస్తున్నామని డీలర్‌లు చెబుతున్నారు.. రేషన్ బియ్యం తీసుకోని వారి జాబితాలో, స్థానిక కార్డులు కూడా ఉండే అవకాశం లేకపోలేదు.. ఏదిఏమైనప్పటికీ రేషన్ బియ్యం పంపిణీకి విధించిన నిర్ణీత గడువు, ఈసారికి 3-4 రోజులు పొడగించి సహకరించాలని డీలర్‌లు అధికారులను కోరుతున్నారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బ్రేకర్‌లు-గ్యాస్ కట్టర్‌లతో..!

# స్లాబ్‌లు నేలమట్టం..!

### నిజాంపేట్‌లో అనుమతులకు మించి అక్రమ అంతస్తులు..!




- అనుమతులు ఉల్లంఘించి నిర్మించిన అక్రమ అంతస్తులపై డిమాలిషన్..
- డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో మూడు అక్రమ నిర్మాణాల్లో కూల్చివేతలు..
- ప్రగతి నగర్, రెడ్డి అవెన్యూ, రుద్ర ఇన్‌ఫ్రాలో భారీ డిమాలిషన్..
- నిజాంపేట్ సర్కిల్ "ఏసిపి-టిపిఎస్" పర్యవేక్షణలో కూల్చివేతలు..

-4 లో

## మహిళలపై కేటీఆర్‌కు చిన్నచూపు

- మహిళలను ఎదగనివ్వాలనే ఆలోచన కేటీఆర్‌కు లేదన్న సీతక్క
- అభయ హస్తం నిధులను కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపణ
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుపట్టారు. మహిళల పట్ల కేటీఆర్‌కు చిన్నచూపు ఉందని, బయటి మహిళలైనా లేదా సొంత కుటుంబ సభ్యులైనా సరే.. వారిని ఎదగనివ్వాలనే ఆలోచన ఆయనకు లేదని చురకలంటించారు. ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ గతంలో చేసిన సెటైర్లను, తప్పుడు ప్రచారాన్ని ఆమె ఈ సందర్భంగా ఎండగట్టారు. అసలు పదేళ్ల పాటు మంత్రిగా ఉండి మహిళల కోసం ఆయన ఏం చేశారో చెప్పాలని నిలదీశారు.

-4 లో



# బ్రేకర్‌లు-గ్యాస్ కట్టర్‌లతో..!

# స్లాబ్‌లు నేలమట్టం..!

## నిజాంపేట్‌లో అనుమతులకు మించి అక్రమ అంతస్తులు..!



నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్‌లో అనుమతులకు మించి అంతస్తులు.

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 17:** నిజాంపేట్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు.. అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులను లక్ష్యంగా చేసుకుని అధికారులు భారీ స్థాయిలో కూల్చివేతలు చేపట్టారు..నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు ప్రధాన నిర్మాణాలలో ఈ డిమాలిషన్ డ్రైవ్ నిర్వహించారు.. ప్రగతి నగర్‌లో ప్లాట్ నెంబర్ 227లో ఒక నిర్మాణం, రెడ్డి అవెన్యూలో ప్లాట్ నెంబర్ 1/ఎలో మరో నిర్మాణం.. అలాగే రుద్ర ఇన్‌ఫ్రాలో ప్లాట్ నెంబర్ 27 పార్ట్, 28 పార్, 41పార్ట్, 42 పార్ట్‌లలో అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులను గుర్తించి కూల్చివేశారు.. ఈ కూల్చివేతలకు పటిష్ఠమైన యంత్రాలను వినియోగించారు.. ముందుగా కాంక్రీట్ స్లాబ్‌లను బ్రేకర్‌లతో ధ్వంసం చేయడంతో పాటు, ఇనుప సువ్వలతో ధృడమైన నిర్మాణాలను గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి పూర్తిగా నేలమట్టం చేశారు.. స్థానికంగా ఈ కూల్చివేతలు తీవ్ర చర్చకు దారితీశాయి..


బ్రేకర్‌లతో స్లాబులు ధ్వంసం చేస్తున్న సిబ్బంది..



- అనుమతులు ఉల్లంఘించి నిర్మించిన అక్రమ అంతస్తులపై డిమాలిషన్..
- డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో మూడు అక్రమ నిర్మాణాల్లో కూల్చివేతలు..
- ప్రగతి నగర్, రెడ్డి అవెన్యూ, రుద్ర ఇన్‌ఫ్రాలో భారీ డిమాలిషన్..
- నిజాంపేట్ సర్కిల్ "ఏసిపి-టిపిఎస్" పర్యవేక్షణలో కూల్చివేతలు..



### ఏసిపి-టిపిఎస్ పర్యవేక్షణలో కూల్చివేతలు..

నిజాంపేట్ సర్కిల్ సిఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం పర్యవేక్షణలో జరిగినట్టు డిమాలిషన్ పేర్కొంది.. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి), టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్(టిపిఎస్) స్వయంగా దగ్గరుండి ఎవరూ అడ్డుకోకుండా, ప్రలోభ పెట్టకుండా కూల్చివేతలు పర్యవేక్షించారు.. ఎలాంటి అడ్డంకులు రాకుండా ముందస్తు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్టు సమాచారం.. టీజీ-బిపాస్ చట్టం ఉల్లంఘన కింద చర్యలు చేపట్టారు.. సెక్షన్ 7 అండ్ 8: స్వీయ ధృవీకరణ ద్వారా అనుమతి పొందిన నిర్మాణాల్లో మార్పులు చేయరాదు.. సెక్షన్ 9 అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే వాటిని రద్దు చేసి చర్యలు తీసుకునే అధికారం టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఉందని ఏసిపి స్పష్టం చేశారు.. అనుమతులను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ఎటువంటి నోటీసులు లేకుండా కూడా డిమాలిషన్ చేయవచ్చని హెచ్చరించారు.. ప్రజలు నిర్మాణాలు చేపట్టే ముందు తప్పనిసరి, అనుమతులు తీసుకుని, అనుమతుల పరిమితుల్లోనే నిర్మాణాలు చేయాలని అధికారులు సూచించారు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేతలు, క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు..



## మల్కాజ్గిరిని చిత్తు చేసి.. కుత్బుల్లాపూర్ విలేఖరుల జట్టు ఫైనల్‌కు..

### బౌలింగ్ ధాటికి మల్కాజ్గిరి 64 పరుగులకే ఆలౌట్..


క్రికెట్‌లో విజయం సాధించిన కుత్బుల్లాపూర్ విలేఖరుల జట్టు..

- 128 పరుగులు చేసి విజయం సాధించిన కుత్బుల్లాపూర్ విలేఖరుల టీమ్..
- అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటిన విలేఖరుల జట్టు..
- ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లి సంబరాలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 17:** మల్లారెడ్డి క్రికెట్ ట్రోఫీ పోటీల్లో కుత్బుల్లాపూర్ విలేఖరుల జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది.. సెమీఫైనల్ మ్యాచ్‌లో సమష్టి ఆటతీరుతో అన్ని విభాగాల్లోనూ కుత్బుల్లాపూర్ ఆధిపత్యం చాటింది.. జట్టు ప్రత్యర్థి మల్కాజ్గిరి జట్టుపై ఘన విజయం సాధించింది.. మొదట బ్యాటింగ్‌కు దిగిన కుత్బుల్లాపూర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు సమయోచితంగా రాణించి పోటీకి సరిపడే స్కోరును నమోదు చేశారు.. అనంతరం 128 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మల్కాజ్గిరి జట్టు, కుత్బుల్లాపూర్ బౌలర్ల ధాటికి బౌలింగ్‌ను ఎదుర్కోలేక పోయింది. ప్రారంభం నుంచే వికెట్లు కోల్పోతూ వచ్చిన మల్కాజ్గిరి జట్టు చివరకు 64 పరుగులకే ఆలౌట్ అయింది.. ఈ విజయంతో కుత్బుల్లాపూర్ జట్టు భారీ తేడాతో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది.. మ్యాచ్‌లో కుత్బుల్లాపూర్ ఆటగాళ్లు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచగా, వారి ఆటతీరుపై అభిమానులు, స్థానిక క్రీడాభిమానులు ప్రశంసలు కురిపించారు.

## బాన్సువాడలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపు




**బాన్సువాడ, మార్చి 17 పెన్ పవర్::** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలోని భవిత సెంటర్లో ఫిజియోథెరపీ క్యాంపు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ గంగాధర్ దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా?ధికారి ఎంఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ సలహాలతో వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. రిసోర్స్ టీచర్ వెంకట పద్మ, ప్రత్యేక ఉపాధ్యాయులు అనిల్, రవీందర్ కూడా పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్::** ప్రభుత్వం రైతులకు పెట్టుబడి కింద ఆర్థిక సాయం అందించే 'రైతు భరోసా' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తాండూరు మండల వ్యవసాయ అధికారి (ఏవో) కొమురయ్య తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇప్పటివరకు రైతు భరోసా పొందని, బ్యాంకు వివరాలు నమోదు చేయని వారు రైతు వేదికల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రంతోపాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు ప్రతులు, మొబైల్ నంబర్ వివరాలను సమర్పించాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు మార్చి 25 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు.

## మహిళలపై కేటీఆర్‌కు చిన్నచూపు

- 3 పేజీ తరువాయి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు చెందిన 'అభయ హస్తం' నిధులను కూడా వాడుకుందని, మహిళా సంఘాలపై రూ. 3,000 కోట్ల భారం వేసి పోయిందని సీతక్క ఆరోపించారు. తాము శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

మరోవైపు మంత్రి శ్రీధర్ బాబు కూడా కేటీఆర్ పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు గోబెల్స్ ప్రచారంలో ప్రపంచంలోనే అందరికంటే ముందుంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో పావలా వడ్డీ పథకం కూడా సరిగ్గా ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై హేళనగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# పదేళ్లు మీరేం చేశారు.?..దాసోజుకు మంత్రి పొన్నం కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ శ్రవణ్ మధ్య మాటల యుద్ధం సాగింది. గవర్నర్ ప్రసంగం పై ధన్యవాద తీర్మానం సందర్భంగా మాట్లాడిన శ్రవణ్.. తెలంగాణ తల్లి నుండి బతుకమ్మను తొలగించారని ఫైర్ అయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా కేసీఆర్ రూపొందించారని చెప్పారు. సీఎం రేవంత్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజల మీద రుద్దుతున్నారని అన్నారు. సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పోటీగా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని నమ్మించి ఓటు వేయించుకొని రెండేళ్లు దాటిందిన్నారు.

గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అమరవీరులకు ,తెలంగాణ ఉద్యమకారులకు ఏం చేసిందో ముందు చెప్పాలని ప్రశ్నించారు మంత్రి పొన్నం ప్రభాకర్. తాము తెలంగాణ ఉద్యమకారులకు సముచిత న్యాయం చేస్తామని చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉండి తెలంగాణ గీతాన్ని , తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు పొన్నం. ఇదే మా తెలంగాణ తల్లి విగ్రహం అని చట్టం ఎందుకు చేయలేదన్నారు. అందరినీ సంప్రదించిన తర్వాత తెలంగాణ తల్లి రూపాన్ని గ్రామీణ ప్రాంత మహిళను ప్రతి బింబించేలా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి సెక్రటేరియట్ గుండెల్లో పెట్టుకున్నామన్నారు.. పేద ప్రజలు కులాలకు అతీతంగా ఆడుకుని జరుపుకునే బతుకమ్మ బీఆర్ఎస్ పేటెంట్ లాగ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహాం గురించి ఎవరైన కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు పొన్నం.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రైతు భరోసా కోసం బ్యాంకు వివరాలు నమోదు తప్పనిసరి

**భూపాలపల్లి, మార్చి 17 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లిలోని మల్హర్ రావు మండల రైతులు, 28-02-2026 లోపు కొత్తగా పట్టాలు పొంది, పట్టాదారు పాస్ పుస్తకాలు, డిజిటల్ సంతకం పొందినవారు ఈ నెల 25 లోపు తమ బ్యాంకు అకౌంట్ వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోల్లపల్లి శ్రీజ మంగళవారం తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు వ్యవసాయ శాఖ సూచించిన ఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులకు అందించాలని సూచించారు.

## మామునూర్ పీఎస్ ను తనిఖీ చేసిన డీసీపీ

**వర్ధన్నపేట, మార్చి 17 పెన్ పవర్:**వరంగల్ మామునూరు పోలీస్ స్టేషన్ ను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పర్వతగిరి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## వెంటాడి మరి దాడి చేస్తున్న యువకులు

**వరంగల్ ఈస్ట్, మార్చి 17 పెన్ పవర్:** వరంగల్ లోని మిల్స్ కాలనీ పరిధిలో కొందరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని వెంటాడి క్రూరంగా దాడి చేశారు. బీర్ సీసాతో తలపై కొట్టడంతో పాటు విచక్షణారహితంగా కొట్టారు. వరంగల్ లో రోజురోజుకు మద్యం మత్తులో యువత మితిమీరిపోతున్నారని, మిల్స్ కాలనీలో ఇలాంటి దాడులు వరుసగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పట్టుదలతో విద్యను అభ్యసించాలి: కలెక్టర్

**పాలకుర్తి, మార్చి 17 పెన్ పవర్:** విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా దామెర మండలంలో ఆమె పర్యటించారు. మండలంలోని ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలను ఆమె పరిశీలించారు. వంట గదితో పాటు స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పులుకుర్తి గ్రామంలోని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో డాక్టర్ కె నారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య తదితరులు ఉన్నారు.

## నిఘా నీడలో రామప్ప ఆలయం

**పరకాల, మార్చి 17 పెన్ పవర్:** యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం ఇకపై నిఘా నీడలోకి రానుంది. కేంద్ర పురావస్తుశాఖ సుమారు రూ. 20 లక్షల నిధులతో రామప్ప ఆలయ పరిసరాలు మొత్తం కనిపించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటుకు పనులు మొదలు పెట్టింది. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## బైక్ ప్రమాదం బలి, గ్రామంలో విషాదం

**మెదక్, మార్చి 17 పెన్ పవర్:** నిజాంపేట మండలం తిప్పనుగుల్ల కల్వకుంట గ్రామానికి చెందిన రాజు యాదవ్ (30) రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. డ్యూటీకి వెళ్తున్న సమయంలో నిజాంపేట శివారులో రెండు బైకులు ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, నాలుగు రోజుల చికిత్స అనంతరం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## 4 కిలోల బరువున్న బిడ్డ పుట్టాడు..!

**సంగారెడ్డి, మార్చి 17 పెన్ పవర్:** మునిపల్లి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం జ్యోతి (23) అనే మహిళ 4 కిలోల బరువున్న మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణంగా శిశువులు 2.5 నుంచి 3 కిలోల బరువు ఉంటారు. అధిక బరువుతో పుట్టిన శిశువును చూసి తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**కల్వకుర్తి, మార్చి 17 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ కారణంగా తిమ్మరాశి పల్లి, జంగారెడ్డిపల్లి, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## చోరీకి వచ్చి.. దొరికిపోయిన దొంగ..!

**అచ్చంపేట, మార్చి 17 పెన్ పవర్:**చోరీకి వచ్చిన ఓ దొంగను పట్టణ ప్రజలు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. కల్వకుర్తి పట్టణంలోని ఓ వార్డులో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసేందుకు ఆదివారం రాత్రి ప్రయత్నిస్తుండగా కుక్కలు పెద్ద ఎత్తున ఆరవడంతో చుట్టు పక్కల వాళ్లంతా అనుమానంతో వచ్చి చూశారు. అలజడి కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రజలతో పాటు పోలీసులు చుట్టుముట్టి మెట్ల కింద దాక్కొన్న ఆ దొంగను పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా...పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెల్సింది. దొరికిన దొంగ మహబూబ్‌నగర్ మండలం కొత్తకోటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆయన్ని పోలీసులు విచారిస్తున్నారు. ఈ విషయం గురించి ఎస్సై మాధవరెడ్డిని వివరణ కోరగా విచారణ జరుగుతోందన్నారు.

# గాజులరామారం సర్కిల్‌లో.. కమిషనర్ ఆకస్మిక పర్యటన..

### బంధం చెరువు ఎఫ్‌టిఎల్,బఫర్ జోన్‌ను తనిఖీలు చేసిన కమిషనర్..

- లాల్‌సాబ్ గూడ మెయిన్ రోడ్‌లో నిర్మాణాన్ని తనిఖీ చేసిన కమిషనర్..
- ఎఫ్‌టిఎల్--బఫర్ జోన్‌లో ఉందా-లేదా..? తేల్చాలని కమిషనర్ ఆదేశాలు..
- బంధం చెరువు సరిహద్దులు గుర్తించి నీటిపారుదల--రెవెన్యూ అప్రమత్తం..
- చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం.. గ్రీన్ మ్యాట్స్, సీసీటివిలకు ఆదేశాలు..




**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 17:** గాజులరామారం సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ ఆకస్మికంగా పర్యటించారు.. ఈ సందర్భంగా లాల్ సాబ్ గూడ మెయిన్ రోడ్ వద్ద జరుగుతున్న నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్, సంబంధిత స్థలం చెరువు ఎఫ్‌టిఎల్‌లో వస్తుందా..? బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా అనే అంశంపై సమగ్రంగా తనిఖీ చేశారు.. ఈ నేపథ్యంలో సంబంధిత నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులకు కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బంధం చెరువుకు ఎఫ్‌టిఎల్ సరిహద్దులను గుర్తించడం తో పాటు, సంబంధిత స్థలం ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లోకి వస్తుందా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాలని సూచించారు. తదుపరి చర్యలు తీసుకునే ముందు పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని కూడా అధికారులను ఆదేశించారు.. అనంతరం కమిషనర్ బంధం చెరువు ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి పరిశుభ్రత పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. చెత్త సేకరణ కేంద్రాల వద్ద గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేసి శుభ్రతను మెరుగుపరచాలని, స్థానికులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.







## నిబంధనలు కాల్చేస్తున్నారు

**నల్గొండ, మార్చి 17 పెన్ పవర్:** ఇటుకల యజమానులు ప్రభుత్వ నిబంధనలను 'బట్టీల్లో'నే కాల్చుతున్నారు. రెవెన్యూ, కార్మిక, పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్తు, అటవీ, అగ్నిమాపక, నీటిపారుదల శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులకు ఇరువైపులా వ్యవసాయ పొలాల్లోనూ బట్టీలు పెడుతున్నారు. నిర్మాణ రంగంలో ఇటుకల అవసరాలను గుర్తించి ధరలను మూడింతలుగా పెంచిన ఇటుక బట్టీల వ్యాపారులు నిబంధనలను మాత్రం తుంగలో తొక్కుతున్నారు. దళారుల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులను పనిలో పెట్టుకుని చాకిరీ చేయిస్తున్నారు. వీరి వేధింపులకు తాళలేక చాలా మంది జిల్లా కార్మికశాఖ అధికారులకు మొరపెట్టుకోగా.. బట్టీ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి విడిపించి వారి స్వస్థలాలకు పంపిస్తున్నారు.

## కొలిక్కిరాని.. ముఖ గుర్తింపు!

**కామారెడ్డి, మార్చి 17 పెన్ పవర్:** ఉపాధి హామీ పథకంలో కూలీల ముఖ నమూనా గుర్తింపు జిల్లాలో ఇంకా కొలిక్కిరావడం లేదు. సాంకేతిక కారణాల వల్ల ముఖ నమూనాల నమోదు ప్రక్రియ పూర్తికాలేదు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనులకు వచ్చిన కూలీలు ఇంటికి వెళ్లిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'వీబీ జీ రాం జీ'గా మార్చనుంది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతో పనుల వద్ద కూలీల ముఖ ఆధారిత హాజరు విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నూతన విధానంలో ప్రతీ కూలీ ముఖాన్ని స్కాన్ చేసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో నమోదు చేస్తున్నారు.

పని చేసే ముందు, చేసిన తర్వాత కూలీల ముఖ నమూనాను తీసుకుంటున్నారు. అయితే, చాలా మంది కూలీలు తమ ఆధార్‌కార్డుల్లోని ఫొటో, ఇతర వివరాలను నవీకరించుకోలేదు. పదేళ్లు, అంతకన్నా ఎక్కువ సంవత్సరాల క్రితం తీసుకున్న ఆధార్‌కార్డుల్లో పాత ఫొటోలు ఉన్నాయి.

# మహాత్మునిపై మహా విచారణ మరిచిపోలేని సంఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతిపిత మహాత్మాగాంధీ జీవితంలో 11 సార్లు జైలుకు వెళ్లాడు. ఆయనకు వేసిన జైలు శిక్షలన్నీ పూర్తిగా అనుభవిస్తే 11 సంవత్సరాల 19 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చేది. వివిధ సందర్భాలలో ఆయన శిక్ష తగ్గించేవారు, అలా ఆయన మొత్తం 6 సంవత్సరాల 10 నెలలు జైల్లో గడిపాడు. 39 యేళ్ల వయసులో ఆయన మొదటిసారి జైలుకి వెళ్లాడు. 75 యేళ్ల వయసులో ఆఖరిసారి జైలు నుండి బయటకు వచ్చాడు. బ్రిటిష్ వలస పాలకుల ఇష్టారాజ్య వ్యవహారాల పట్ల గాంధీజీ పలు మార్లు నిరసించాడు. పాలకుల నిర్ణయాలను వ్యతిరేకించాడు. తిరుగు బాటును బోధించాడు. సామూహిక పౌర శాసనోల్లంఘనాన్ని అనుసరించాడు. అనేకసార్లు జైలుకు వెళ్లాడు. అరెస్టు చేసినప్పుడు ఆయన నేరాన్ని వెంటనే అంగీకరించే వాడు. తనకు కఠిన శిక్ష విధించమనేవాడు. జైలు జీవితమంటే కష్టం, జైలుకి వెళ్లడమంటే అవమానం, జైలంటే భయంకరం, జైలంటే నేరస్తులకు శిక్షా కేంద్రం అనే సాధారణ భారతీయులకు జైలు పట్ల గల అభిప్రాయాలను, ఆలోచనలను మనసుల్లోంచి తొలగించే నిరంతర ప్రయత్నాలు చేశాడు. ప్రజల స్వేచ్ఛకు గండి కొట్టిన రౌలత్ చట్టం, అత్యంత దారుణమైన జలియన్వాలాబాగ్ మారణ హె?మం నేపథ్యంలో సహాయ నిరాకరణకు పిలుపునిచ్చిన గాంధీజీ, దేశ ప్రజలను చైతన్య పరుస్తూ యంగ్ ఇండియాలో వ్యాసాలు రాశాడు. ఇవి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రజలను రెచ్చగొట్టేలా ఉ న్నాయంటూ.. గాంధీజీపై భారత నేర శిక్షాస్మృతి 124ఏ కింద రాజద్రోహం బ్రిటిష్ అధి కారులు కేసు నమోదు చేశారు. గాంధీజీతో పాటు యంగ్ ఇండియా ప్రచురణకర్త ఎస్.జి.బంకర్ పై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో 1922 మార్చి 18న అహ్మదాబాద్ లోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్లో 'మహా విచారణ' మొదలైంది. భారత దేశంలో గాంధీ ఎదుర్కొన్న సంబంధిత మొదటి కోర్టు విచారణ మరిచిపోలేని సంఘటన. కోర్టులో విచారణ ఆరంభం కాగానే గాంధీజీ తనపై అభియోగాలన్నింటినీ అంగీకరించారు. విప్లవ కార్యకలాపాల అభియోగాలపై జడ్జి గాంధీకి ఆరేళ్లు సాధారణ జైలు శిక్ష విధించాడు. "మీతో రాజకీయంగా విభేదించేవారు కూడా మిమ్మల్ని ఉన్నతమైన మనిషిగా, పవిత్రమైన సాధు జీవితం గడిపే వ్యక్తిగా గౌరవిస్తారు," అన్నారు నాటి న్యాయ మూర్తి బ్రూమ్ ఫీల్డ్. గాంధీ మాట్లాడుతూ, "భారత దేశమంతా గౌరవించే దేశభక్తులు చాలా మంది ఈ సెక్షన్ కిందే జైలుకి వెళ్లారని నాకు తెలుసు, నాకూ ఇదే విధించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నేను నిప్పుతో ఆటలాడుతున్నానని నాకు తెలుసు, అయినా నేను అదే పని చేస్తాను." అన్నాడు. గాంధీ కోర్టు గదిలోకి వచ్చి, వెళ్లిపోతున్నప్పుడు అక్కడున్నవారంతా గౌరవంగా లేచి నిలబడ్డారు. పోలీసులు ఆయనను ముంబయి రాజకీయ ఖైదీ నం. 50 అని పేర్కొన్నారు. అడ్వొకేట్ జనరల్ స్ట్రాంగ్మన్ గాంధీజీ పై నేరారోపణలు చేస్తూ, అహింస పేరుతో ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రజలను గాంధీ రెచ్చగొడుతున్నారని, ముంబయి, మలబార్, చౌరీచౌరా సంఘటనల్లోని హింసాకాండను కూడా



దృష్టిలో ఉంచుకొని తీర్పునివ్వాలని ని కోరాడు. గాంధీజీ తన వాదన వినిపిస్తూ... అడ్వొకేట్ జనరల్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానని, ప్రభుత్వ వ్యవస్థ పట్ల అయిష్టమనేది తనకు అలవాటుగా మారిందని, మంచికి సహకారం ఎలాంటిదో.. చెడుకు సహాయ నిరాకరణ కూడా అలాంటిదేనని పేర్కొన్నాడు. హింసాయుతమైన సహాయ నిరాకరణ అనేది చెడును మరింత పెంచుతుందే తప్ప తగ్గించదనేది నా దేశవాసులకు తెలియ చెప్పాలను కుంటున్నాని, ముంబయి, చౌరీచౌరా సంఘటనలు తప్పేనని, బాధ్యతగల వ్యక్తిగా తాను నిర్ణయాలు తీసుకున్నప్పుడు వాటి పరిణామాలను కూడా ఊహించి ఉండాల్సిందని, నిప్పుతో ఆడుకుంటున్నానని తనకు తెలుసునన్నారు. అయితే దేశానికి తీరని హాని చేస్తున్న మీ ప్రభుత్వాన్ని సమర్థించలేను గదా అంటూ, హింస లేకుండా ఉద్యమం ఉండాలనుకున్నా, కానీ కొన్నిసార్లు నా ప్రజలు పిచ్చిగా వ్యవహరించారని, అందుకు క్షమాపణలు చెబుతున్నానని, అలాగని తాను క్షమాభిక్ష కోరటం లేదన్నాడు. అందుకే తనకు అత్యంత కఠినాతి కఠినమైన శిక్ష విధించాలని కోరుకుంటున్నానని... అహింస అంటే చెడుకు సహాయ నిరాకరణ చేసినందుకు విధించే శిక్షను భరించటం కూడా అంటూ. మీచట్టం ప్రకారం కఠినాతి కఠిన శిక్ష విధించండి. న్యాయమూర్తి దృష్టిలో తనది నేరం కావచ్చునని, తన దృష్టిలో మాత్రం పౌరుడిగా తన బాధ్యత అని వివరించాడు. జడ్జి తాము అనుకుంటున్న అదే నేరాన్ని అనేకమంది ఆంగ్లేయులు, అధికార యంత్రాంగంలోని భారతీయ సహచరులు కూడా చేస్తున్నారన్నాడు. భారత్ కు బ్రిటిష్ వ్యవస్థ చేసినంత హాని మరేదీ చేయలేదని, ప్రజల స్వేచ్ఛను హరించే రౌలత్ చట్టం తేవడం, జలియన్ వాలాబాగ్ లో, పంజాబ్ లో దారుణాలకు పాల్పడడం లాంటి అవాంచనీయాల వ్యవస్థ పట్ల ఆరాధన పెంచుకుంటే పాపం చేసిన వాడినవుతానని ఆయన నొక్కి చెప్పాడు. తమరు పాటిస్తున్న చట్టం ప్రజలకు హాని చేస్తోందని భావిస్తే.. మీ పదవికి రాజీనామా చేసి, ఆ చెడుకు దూరంగా ఉండండి అని, తమ చట్టం ప్రజలకు మేలు చేసేదే అని అనుకుంటే తనను దోషిగా నిర్ధారించి కఠినాతి కఠిన శిక్ష విధించండి అంటూ అంటూ గాంధీజీ ముగించాడు. గాంధీజీ మాటలకు చలించిన న్యాయమూర్తి బ్రూమ్ ఫీల్డ్ అనూహ్యంగా గాంధీజీ ముందు తలవంచి అభివాదం చేసి తన తీర్పు చదివారు. బహుశా ఏ న్యాయ మూర్తికైనా ఇలాంటి పరిస్థితి ఇబ్బందికరమైనదే, నా సర్వీసులో మీలాంటి ప్రత్యేకమైన వ్యక్తిని చూడలేదు. చూడను కూడా. రాజకీయంగా మీతో విభేదించేవారు కూడా మీ విలువలను, ఆదర్శ జీవితాన్ని గౌరవించకుండా ఉండలేరు... అంటూ ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ఒకవేళ ఈ శిక్షను ప్రభుత్వం తగ్గిస్తే.. నా కంటే సంతోషించే వారుండరు అంటూ మరోమారు గాంధీజీ ముందు గౌరవ పూర్వకంగా తలవంచి వెళ్లిపోయారు. గాంధీజీని తొలుత సబర్మతి జైలుకు, తర్వాత ప్రత్యేక రైలులో పుణేలోని యెరవాడ జైలుకు తరలించారు. అనారోగ్య కారణాల వల్ల 22 నెలల తర్వాత బేషరతుగా విడుదల చేశారు.

# నిఖార్సైన కాంగ్రెస్ వాది ధర్మసంకటం!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ యవనికపై తనదైన ముద్రవేసిన మేధావి, నిబద్ధత గల నాయకుడు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రస్తుతం ఒక కీలక మలుపులో ఉంది. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ఈ సీనియర్ నేత భవిష్యత్తుపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో సీనియర్, సిన్సియర్ నేతగా, శాసనసభలో తన వాగ్ధాటితో ప్రత్యర్థులను కడిగి పారేసే 'నిఖార్సైన కాంగ్రెస్ వాది'గా పేరున్న జీవన్ రెడ్డికి ప్రస్తుత పరిణామాలు మింగుడు పడడం లేదు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గ సమీకరణాలు, సొంత పార్టీలోనే మారుతున్న ప్రాధాన్యతలు ఆయన రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు పరుస్తున్నాయి. జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని గమనిస్తే, ఆయన 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించి, తొలి ప్రయత్నంలోనే జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన, ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి 1989, 1996 (ఉప ఎన్నిక), 1999, 2004, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా పనిచేసి రాష్ట్ర వ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి తన సత్తా చాటారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు ఆయన సొంతం. అయినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల స్థానం నుంచి మరోసారి ఓటమిని చవి చూడడం ఆయన కెరీర్‌లో పెద్ద కుదుపుగా మారింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం పార్టీ ఫిరాయింపులు. సుదీర్ఘ కాలం పాటు జగిత్యాలలో జీవన్ రెడ్డికి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్ రెడ్డికి అశనిపాతంలా మారింది. దశాబ్ద కాలంగా ఎవరితోనైతే పోరాడారో, ఎవరి విధానాలను ఎండగట్టారో, అదే వ్యక్తిని పార్టీలోకి ఆహ్వానించడం ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యత ఇచ్చే జీవన్ రెడ్డి, కేవలం సంఖ్యాబలం కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీ అధిష్ఠానం తనను సంప్రదించ కుండానే ఈ నిర్ణయం తీసుకోవడం, కనీసం సమాచారం కూడా ఇవ్వకపోవడం ఆయనను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. దీనికి తోడు, తన ప్రధాన అనుచరుడు గంగారాం దారుణ హత్యకు గురికావడం జీవన్ రెడ్డిని మరింత కుంగదీసింది. ఈ సంఘటన వెనుక రాజకీయ కుట్రలు ఉన్నాయని, పార్టీ అధికారంలో ఉన్నా తన కార్యకర్తలకు రక్షణ కల్పించలేక పోతున్నాననే బాధ ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గణాంకాల పరంగా చూస్తే, జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి గట్టి పట్టు ఉంది. 2014లో ఆయన 78,000 పైచిలుకు ఓట్లతో గెలిస్తే, 2018లో ఓటమి చెందినప్పటికీ గణనీయమైన ఓట్లు



సాధించారు. 2023లో సంజయ్ కుమార్ చేతిలో దాదాపు 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే, ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఆయన ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఓట్లతో భారీ మెజారిటీతో గెలిచారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కు నిదర్శనం. కానీ, ప్రస్తుత సమీకరణాల్లో నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఉండాలంటే ఎమ్మెల్యేగా ఉన్న సంజయ్ కుమార్‌తో కలిసి పనిచేయడం లేదా ఆయనను సహించడం జీవన్ రెడ్డికి అసాధ్యమైన పనిగా మారింది. జీవన్ రెడ్డి భవితవ్యం ఇప్పుడు మూడు మార్గాల మధ్య ఊగిసలాడు తోంది... మొదటిది, అధిష్ఠానం బుజ్జగింపులకు లోబడి పార్టీలోనే కొనసాగడం. ఇప్పటికే పీసీసీ నాయకత్వం, ఆయనతో చర్చలు జరిపారు. ఆయనకు సముచిత గౌరవం కల్పిస్తామని, భవిష్యత్తులో రాజ్యసభ సీటు లేదా మరో కీలక పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, పదవుల కంటే ఆత్మాభిమానానికే ప్రాధాన్యత ఇచ్చే ఆయన, పార్టీలో తనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని భావిస్తే రాజీనామా దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. రెండోది, స్వతంత్రంగా లేదా వేరే రాజకీయ వేదిక ద్వారా తన ప్రయాణాన్ని కొనసాగించడం. కానీ, కాంగ్రెస్ రక్తంతో నరనరాన జీర్ణించుకున్న ఆయన వేరే పార్టీలోకి వెళ్లడం అంత సులభం కాదు. మూడోది, రాజకీయ సన్యాసం తీసుకోవడం. తన సుదీర్ఘ అనుభవాన్ని గౌరవిస్తూ, ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుని మార్గదర్శిగా ఉండటం. కానీ, జీవన్ రెడ్డి శైలి పోరాటపటిమతో కూడుకున్నది. ఆయన నిశ్శబ్దంగా ఇంటికి పరిమితమయ్యే వ్యక్తి కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన వంటి సీనియర్, చట్టసభల వ్యవహారాల్లో పట్టున్న నాయకుడి అవసరం చాలా ఉంది. ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కోవడంలో ఆయన అనుభవం పార్టీకి శ్రీరామరక్ష. ఒకవేళ ఆయన పార్టీని వీడితే, అది ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ అవుతుంది. ముఖ్యంగా రైతాంగ సమస్యలపై, సాగునీటి ప్రాజెక్టులపై ఆయనకు ఉన్న అవగాహన అపారం. ఎస్సారెస్పీ పునరుజ్జీవనం కోసం ఆయన చేసిన కృషి జగిత్యాల ప్రజలు మర్చిపోలేరు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, జీవన్ రెడ్డి ఇప్పుడు ఒక ధర్మసంకటంలో ఉన్నారు. పార్టీలో కొనసాగితే తన ఉనికిని కాపాడుకోవడానికి నిరంతరం సంఘర్షించాల్సి ఉంటుంది. ఒకవేళ బయటకు వస్తే దశాబ్దాల అనుబంధం తెగిపోతుంది. అధిష్ఠానం ఆయనకు కేవలం హామీలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఆయన ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలి. జగిత్యాల నియోజకవర్గంలో సంజయ్ కుమార్ మరియు జీవన్ రెడ్డి వర్గాల మధ్య సయోధ్య కుదర్చడం కత్తిమీద సామే. ఒకవేళ ఈ విభేదాలు ఇలాగే కొనసాగితే, వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ అక్కడ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. జీవన్ రెడ్డి భవిష్యత్తు కేవలం ఆయన వ్యక్తిగత నిర్ణయంపైనే కాకుండా, పార్టీ ఆయనకు ఇచ్చే భరోసాపై ఆధారపడి ఉంది. విలువలతో కూడిన రాజకీయాలు అంతరించిపోతున్న ఈ కాలంలో, జీవన్ రెడ్డి వంటి నాయకుడి అడుగులు ఎటువైపు పడతాయోనని సామాన్య ప్రజలు సైతం ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆయన రాజకీయ నిష్క్రమణ జరిగితే అది ఒక శకానికి ముగింపు అవుతుంది, అదే ఆయన పోరాటం కొనసాగిస్తే అది కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. ఏది ఏమైనా, జీవన్ రెడ్డి భవితవ్యం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయంగా మిగిలి పోనుంది.

## సంచార జాతుల సర్వే పుస్తకావిష్కరణ

**కోరుట్ల, మార్చి 17 పెన్ పవర్:** జగిత్యాల పట్టణంలో మంగళవారం జాతీయ సామాజిక సమరసత వేదిక జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో, వార్డు కౌన్సిలర్ వాన రాసి తిరుమలయ్య సమక్షంలో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంచార జాతుల సమగ్ర సర్వే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన వక్త సాయి మధుకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సంచార జాతులపై అధ్యయనం చేసి, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించేలా న్యాయం చేయాలని కోరారు. జాతీయ సమరసత వేదిక జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు కూడా సంచార జాతుల సమస్యలను ప్రస్తావించారు.

## వేములవాడ ఆలయంలో సౌకర్యాల లేమి, భక్తుల ఆవేదన

**వేములవాడ, మార్చి 17 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న వేములవాడ పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పేరుతో భీమేశ్వరాలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కొబ్బరికాయలు కొట్టే చోట మురికి నీరు నిలిచి దుర్వాసన వస్తున్నా పట్టించుకోవడం లేదు. టికెట్ల కోసం డబ్బులు తీసుకుంటున్నప్పటికీ, సాధారణ భక్తులను ఇబ్బంది పెడుతూ కొందరు వీఐపీలు నేరుగా గర్భగుడిలోకి దర్శనానికి వెళ్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ దుస్థితిపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాలువలో గల్లంతైన ప్రభుత్వ ఉద్యోగి మృతి

**మానకొండూరు, మార్చి 17 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట వద్ద కాలువలో గల్లంతైన ప్రభుత్వ ఉద్యోగి రాచకొండ లచ్చయ్య (55) మృతదేహం ఆదివారం లభ్యమైంది. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లచ్చయ్య, ఆదివారం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయారు. ఒడ్డున ఆయన దుస్తులు, బైక్ గుర్తించిన పోలీసులు గాలింపు చేపట్టగా, చింతకుంట శివారులో మృతదేహం దొరికింది. భార్య పద్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

**రామగుండం, మార్చి 17 పెన్ పవర్:** రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. ఈ ఘటన పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలో పెద్దపల్లి – రామగుండం రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, బసంత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ (47), రజిత (40) దంపతుల కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. ఆమెను చూసేందుకు వారు కారులో వెళ్లారు. కలిసిన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళుతున్న క్రమంలో బసంత్‌నగర్ గ్రామ శివారు వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

## వేగం పెంచితేనే ధర్మపురి అభివృద్ధి

**ధర్మపురి, మార్చి 17 పెన్ పవర్:** లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్రస్థాయిలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. ఆలయాన్ని గోదావరి పుష్కరాలలోపు మూడు విడతల్లో అభివృద్ధిపరచాలని నిర్ణయించారు. అయితే అనుకున్నంత వేగంగా అభివృద్ధి పనులకు అడుగులు పడటం లేదు. సమీక్షలు చేస్తున్నా ప్రతిపాదించిన పనులపై స్పష్టత రావడం లేదు. దేవస్థానం అభివృద్ధి పనులు, భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపుల్లో పలుమార్లు గ్రామ సభలు నిర్వహిస్తున్నా వేగం పెరగడం లేదు. ఏడాదిలోపు పుష్కరాలు ఉన్నందున మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉంది.

## ఈనెల 27న భద్రాచలానికి సీఎం రేవంత్

**భద్రాచలం, మార్చి 17 పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 27న భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఉగాది రోజున ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల సందర్భంగా, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ దంపతులను నవమి వేడుకలకు ఆహ్వానించనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రూ.300 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయగా, తొలి విడతగా రూ.100 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

## విద్యార్థిని ఆత్మహత్య

**ఖమ్మం, మార్చి 17 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకి చెందిన కృష్ణబాబు, అంజమ్మల కుమార్తె శ్రీవిద్య (20) కేయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతోంది. పద్మాక్షి హాస్టల్ బి బ్లాక్ లో ఉంటున్న ఆమెకు, అదే హాస్టల్లో ఉంటున్న సీనియర్లకు మధ్య ఓ విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో శ్రీవిద్యపై ఆరుగురు సీనియర్లు దాడి చేయడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనస్తాపంతో శ్రీవిద్య ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది.

## ఘనంగా రామయ్య నిత్య కళ్యాణం



**కొత్తగూడెం, మార్చి 17 పెన్ పవర్:** భద్రాచలంలోని శ్రీరామచంద్రుని సన్నిధిలో మంగళవారం నిత్య కళ్యాణ అర్చకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం, మేళతాళాల మధ్య గర్భగుడి నుంచి బేడా మండపంలో కొలువు తీర్చారు. అనంతరం విశ్వక్సేన పూజ, అమ్మవారికి కంకణధారణ గావించి నిత్య కళ్యాణ వేడుకలను వైభవంగా జరిపారు.

## వసతి గృహాలకు గ్యాస్ కష్టాలు!

**పినపాక, మార్చి 17 పెన్ పవర్:** పాల్వంచ గిరిజన ఆశ్రమ పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు పశ్చిమాసియాలో యుద్ధం వంటగ్యాస్‌పై ప్రభావం చూపుతోంది. జిల్లాలో సంక్షేమ వసతిగృహాలకు సెగ తాకింది. వారం రోజులుగా గ్యాస్ సిలిండర్లు సరఫరా కాకపోవటంతో వసతిగృహాల నిర్వాహకులు కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. విద్యార్థులను పస్తులు ఉంచలేక సంక్షేమాధికారులు కట్టెలను తీసుకుంటున్నారు. ఫలితంగా పొగ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఒకవైపు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు చివరి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారానికి ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకొని వండుతున్నారు.

## శుభాకాంక్షలు తెలుపుతూనే.. అనంతలోకాలకు

**అశ్వారావుపేట, మార్చి 17 పెన్ పవర్:** ఓ శుభకార్యానికి హాజరైన మహిళ.. శు భాకాంక్షలు తెలుపుతూ గుండెపోటుతో మృతిచెందిన విషాదకర ఘటన ఖమ్మం నగరంలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. గాంధీచౌక్‌కు చెందిన వ్యాపారి బొమ్మ వెంకటరమణ కుటుంబీకులు వెలుగుమట్లలోని జీఆర్ఆర్ శ్రీనివాసమ్‌లో జరిగిన ఓ గృహప్రవేశానికి హాజరయ్యారు. గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు చెబుతూ వెంకటరమణ భార్య సుస్మిత(40) ఫోటో దిగుతున్నారు.

# మూసీ ప్రక్షాళన... రంగంలోకి నాలుగో కృష్ణుడు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో మూసీ నదికి ఒక విచిత్రమైన చరిత్ర ఉంది. అదెలాగంటే.. ప్రతి ఎన్నికలకు ముందు మూసీ నది 'లండన్ థేమ్స్'లా మారిపోతుంది.. ఎన్నికలు అయిపోయాక మళ్ళీ యథావిధిగా 'మురికి కూపం'గా ప్రమోషన్ పొందుతుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారి వంతు వచ్చింది. బాపూఘాట్ దగ్గర ఏకంగా గాంధీజీ విగ్రహాన్ని పెట్టేసి, మూసీని 'గాంధీ సరోవరం'గా మార్చేయాలని ప్లాన్ చేశారు. వింటేనే భలే ఉంది కదూ!కానీ అసలు సమస్య అంతా ఇక్కడే ఉంది. నదిని బాగు చేద్దామని రేవంత్ పీపీటీ ప్రెజెంటేషన్లు ఇస్తుంటే అవతలి వైపు విపక్షాలు 'సర్జికల్ స్ట్రైక్' అంటూ కత్తులు నూరుతున్నాయి.ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ఏడీబీ బ్యాంకు నుంచి అప్పు తెచ్చి, మూసీని సుందరీకరిస్తామని చెబుతుంటే.. విపక్షాలేమో "మా ఇల్లు కూల్చేస్తారా?" అంటూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నా యి. నిజానికి ఈ విల్లాలు, అపార్ట్‌మెంట్లు కట్టినప్పుడు ఆ గూగుల్ మ్యాప్స్ అప్పట్లో ఎక్కడికి వెళ్లాయో ఎవరికీ అర్థం కావడం లేదు.మూసీ ప్రక్షాళన అనేది పాతకాలపు సీరియల్ లాంటిది. చంద్రబాబు సమయంలో "నందనవనం" పేరుతో కాలువ కడితే.. అది వర్షానికి 'నీట' మునిగింది. వైఎస్ఆర్ హయాంలో "సేవ్ మూసీ" అంటూ రబ్బరు డ్యామ్ కడితే.. అది వరదకు కొట్టుకుపోయింది. కేసీఆర్ పాలనలో "రివర్ ఫ్రంట్" అని కార్పొరేషన్ పెట్టారు.. అది చివరికి రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. ఇప్పుడు రేవంత్ గారు "గాంధీ సరోవరం" అంటున్నారు. చరిత్ర పాఠాలు చదివితే.. "మూసీ ప్రక్షాళన" అంటేనే ఒక పెద్ద 'ప్రాజెక్టు అటకెక్కింపు' కార్యక్రమం అని అర్థమవుతోంది.అక్రమ కట్టడాల కూల్చివేత విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటే, పేదవాడి కన్నీరు.. అదే పెద్ద పెద్ద విల్లాల దగ్గర కొచ్చేసరికి 'సర్దుబాటు' రాజకీయాలు.. ఇదే కదా మన హైదరాబాద్ స్పెషాలిటీ! సర్కార్ ఏమో లండన్ కలను చూపిస్తుంటే.. నిర్వాసితులు మాత్రం 'మా గూడు మాకుండనివ్వండి' అని ప్రాధేయపడుతున్నారు.చివరికి మూసీ మారుతుందో లేదో తెలియదు కానీ, రాజకీయ పార్టీలకు మాత్రం మూసీ ఒక 'శాశ్వత ఆదాయ వనరు'గా 'నిరంతర విమర్శనాస్త్రం'గా మారిపోయింది. మొత్తానికి మూసీకి శుద్ధి ఎప్పుడు జరుగుతుందో కానీ, రాజకీయ నాయకులకు మాత్రం ఈ ఇష్యూతో ఎప్పుడూ 'పబ్లిసిటీ' పుష్కలంగా దొరుకుతోంది.

# సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**బెల్లంపల్లి, మార్చి 17 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో ఖీఉ3 ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లలో సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెమోరాండం మంగళవారం ఇవ్వబడింది. స్ట్రక్చర్ మీటింగ్‌లో అంగీకరించిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, మెడికల్ బోర్డును పునఃప్రారంభించాలని, కార్మికుల సంత ఇంటి కల పథకాన్ని అమలు చేయాలని, ఇన్కమ్ టాక్స్ పెర్క్ పైన అలవెన్స్ తిరిగి చెల్లించాలని, నూతన బొగ్గు గనులను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## ఈనెల 19 శ్రీ గోపాల్ కృష్ణ మఠంలో ఉగాది వేడుకలు

**ఆదిలాబాద్, మార్చి 17 పెన్ పవర్:** ఆదిలాబాద్‌లోని శ్రీ రామచంద్ర గోపాల్ కృష్ణ మఠంలో ఈనెల 19వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మఠాధిపతి శ్రీ యోగనంద సరస్వతి తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఉగాది పచ్చడి పంపిణీ ఉంటుంది. సాయంత్రం శ్రీ వెంకటేశ్వర సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం నిర్వహించబడుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

# పండగలు హిందూ సంస్కృతికి సాక్ష్యం

**బోథ్, మార్చి 17 పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లా, ఆదిలాబాద్ లో శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామిజీ మాట్లాడుతూ మనం నిర్వహించుకునే పండగలు మన హిందూ సంస్కృతికి సాక్ష్యాలని అన్నారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ముద్రించిన క్యాలెండర్ ను మంగళవారం ఆవిష్కరించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న మఠంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో హిందూ సమ్మేళనం కమిటీ ఎన్నిక పూర్తి

**ముథోల్, మార్చి 17 పెన్ పవర్:** ఏప్రియల్ 11 న ఆదిలాబాద్ పట్టణంలో హిందూ సమ్మేళనం నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. సంజయ్ నగర్ కాలనీలో నిర్వహించనున్న ఈ సమ్మేళనం కోసం స్థానిక శివాలయంలో జరిగిన సమావేశంలో హిందూ ఉత్సవ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. శ్రీధర్ గౌడు అధ్యక్షులుగా, ఉడుగు బూమన్న కార్యదర్శిగా, మురళి కోశాధికారిగా ఎన్నికయ్యారు. పలువురు ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటైంది. ఏప్రియల్ 11 సాయంత్రం 4:30 గంటలకు అయోధ్య కాలనీలో జరిగే ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్ మృతికి ఆత్రం సుగుణ సంతాపం

**ఖానాపూర్, మార్చి 17 పెన్ పవర్:**ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర గోవింద్ నాయక్ మృతి పట్ల టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మంగళవారం తీవ్రగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు. ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. గోవింద్ నాయక్ మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన గొప్ప నాయకుడని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**జగిత్యాల, మార్చి 17 పెన్ పవర్:** జగిత్యాల పట్టణంలోని 19, 20 వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమాన్ వాడ ప్రధాన కూడలిలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మాట్లాడుతూ, సమాజ సేవలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని, ఇకముందు కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చింతల గంగాధర్, తుమ్మనపెల్లి సంతోష్ ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు జరగడం అభినందనీయమని ఆయన అన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 25న గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్ రెడ్డి !



**కరీంనగర్ పెన్ పవర్:** సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి.. ఇక పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 4 దశాబ్దాలుగా హస్తం పార్టీలో ఉన్న జీవన్ రెడ్డి.. ఇక చేతికి గుడ్‌బై చెప్పి.. కారు ఎక్కనున్నట్లు సమాచారం. ఈనెల 25న గులాబీ కండువా కప్పుకునేందుకు జీవన్ రెడ్డి రెడీ అయినట్లు సంబంధిత వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు జీవన్ రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలు చించేయడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి, హస్తం పార్టీ సీనియర్ నేత టీ జీవన్ రెడ్డి .. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో తీవ్ర మనోవేదనకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానాలు ఎదురవుతున్నాయని.. ఆయన బహిరంగంగా మీడియా ముందే వెల్లడించడం గమనార్హం. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరగా.. అప్పటి నుంచి జగిత్యాలలో వర్గపోరు మొదలైంది.అది కాస్తా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తారస్థాయికి చేరుకుంది. తమ వర్గం వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి.. తమ అనుచరులను ఇండిపెండెంట్లుగా పోటీ చేయించి.. గెలిపించుకుని తన సత్తా ఏంటో హైకమాండ్‌కు తెలియజేశారు. అయినప్పటికీ తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తన అనుచరులతో జీవన్‌రెడ్డి చెప్పినట్లు సమచారం. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరనున్నట్లు తెలుస్తోంది. గత 4 దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన జీవన్‌రెడ్డి.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా గెలిచారు. అయితే డాక్టర్ సంజయ్ కుమార్ రాకతో కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యం లేనందునే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 25వ తేదీన జగిత్యాలలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి.. గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. జగిత్యాలలో ఉన్న జీవన్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ ఫ్లెక్సీలను.. ఆయన అనుచరులు చించేయడం, తొలగించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయన నివాసం ముందు, లోపల ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండాలు, అగ్రనాయకుల ఫోటోలతో కూడిన బ్యానర్లను కార్యకర్తలు తీసేశారు. కేవలం జీవన్ రెడ్డి మాత్రమే ఉన్న ఫోటోలు, ఫ్లెక్సీలను ఉంచుతున్నారు. తాను పార్టీకి ఎంత చేస్తున్నా దాన్ని అధిష్టానం గుర్తించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జీవన్ రెడ్డి.. ఇక కాంగ్రెస్ పార్టీతో బంధం తెంచుకోవడమే మేలు అని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో సుదీర్ఘంగా మంతనాలు జరిపిన తర్వాతే.. పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**40 ఏళ్ల అనుబంధం**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేతగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, ఇప్పుడు ఆ పార్టీకి చేయి ఇచ్చి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ పరిణామం జగిత్యాల జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. టీ. జీవన్ రెడ్డి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అనే రీతిలో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయం సాగింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు ఆయనను తీవ్రంగా కలిచి వేస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో జీవన్ రెడ్డికి పొసగడం లేదు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తనకు కాకుండా, పక్క పార్టీ నుంచి వచ్చిన వారికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి చైర్‌పర్సన్ పదవి వరకు అన్ని నిర్ణయాల్లోనూ సంజయ్ కుమార్ వర్గానికి పెద్ద పీట వేశారని, దీని వల్ల జీవన్ రెడ్డికి పార్టీలో ప్రాధాన్య తగ్గుతూ వచ్చిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తను కాదని సంజయ్ కుమార్‌కు నియోజకవర్గ పగ్గాలు అప్పగించడం, స్థానిక నిర్ణయాల్లో తన ప్రమేయం లేకుండా పోవడం ఆయనను తీవ్రంగా బాధించింది. తనకు, తనను నమ్ముకున్న అనుచరులకు పార్టీలో కనీస గౌరవం, ప్రాధాన్యత దక్కడం లేదని జీవన్ రెడ్డి భావిస్తున్నారు. సీనియర్ నేతా తన సలహాలను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆయనకు మింగుడుపడటం లేదు. ఈ క్రమంలోనే ఆయన తన సన్నిహితులు, ముఖ్య అనుచరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీలో మనకు గుర్తింపు లేనప్పుడు ఇక్కడ కొనసాగడం కంటే ప్రత్యామ్నాయం చూసుకోవడమే ఉత్తమం అనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్టు సమాచారం. సోషల్ మీడియా ఖాతాల నుంచి కాంగ్రెస్ పేరును తొలగించడం, తన అనుచరుల సోషల్ మీడియా పోస్టులు పార్టీ మార్పును ధృవీకరిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ బహిరంగంగా మాత్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు అని ఆయన కొంత సమయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ నెల 25న జగిత్యాలలో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ వేదికపైనే ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, వేలాది మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. పార్టీలో ఆయనకు సముచిత స్థానం, తగిన గౌరవం ఇస్తామని బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి గట్టిగా హామీ లభించినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు పటిష్టమైన క్యాడర్ ఉంది. ఆయన నిర్ణయం వల్ల కాంగ్రెస్ బలం తగ్గే అవకాశం ఉండగా, బీఆర్ఎస్‌కు ఇది ఉత్తర తెలంగాణలో పెద్ద బూస్ట్‌గా మారనుంది. జగిత్యాలలో బీఆర్ఎస్ బలం మళ్లీ పుంజుకోవడానికి జీవన్ రెడ్డి రాక ఒక వరంలా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.


# ప్రైవేటు దవాఖానాలపై సర్కార్ నిఘా




**వరంగల్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ప్రతి హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ విధానం ద్వారా ఫేక్ డాక్టర్లు, అనధికారిక క్లినిక్‌లకు అడ్డుకట్ట వేస్తూ హాస్పిటల్ పూర్తి వివరాలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.తెలంగాణలో నకిలీ వైద్యులు ఎక్కువైపోయారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 250 నకిలీ హాస్పిటల్స్ ఉన్నట్లు తేలింది. అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతూ.. కాసుల కోసం హాస్పిటల్స్ ఓపెన్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ వైద్యానికి చెక్ పెడుతూ.. ఆన్‌లైన్‌లోనే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. ప్రైవేటు హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరిగా అవి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం జిల్లా వైద్యాధికారి ఆఫీసుకు వెళ్లాలనే నిబంధన ఉంది. ఈ విధానం వల్ల పలు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అనధికారికంగా ఆసుపత్రులను నడిపిస్తున్నారు. అటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో ఇటీవల పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ఫిజియోథెరపీ కేంద్రాలు కూడా సీఈఏను పట్టించుకోవడంలేదని తెలిసింది. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా సర్కారు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ సీఈఏ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో తాజాగా పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు.ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కోసం కాలుష్య నియంత్రణ మండలి ధ్రువీకరణ పత్రం, బయోమెడికల్ వ్యర్థాల వివరాలు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు, పనిచేసే డాక్టర్లు, నర్సులు.. వారి అర్హత, అందిస్తున్న సేవలు.. వైద్య సేవల ధరలు, పడకల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేశాక జిల్లా వైద్యాధికారి పరిశీలించి కలెక్టర్‌కు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కలెక్టర్ పరిశీలించి అనుమతికి అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.నల్గొండ, ప్రస్తుతం కొన్ని అలోపతి హాస్పిటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా హోమియో డాక్టర్లు కూడా పనిచేస్తున్నారు. ఆర్ఎంపీలు అర్హత లేకున్నా హాస్పిటల్స్

నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ కావడం వల్ల ఇకపై ఇలాంటి వాటికి కూడా అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ప్రజలు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి సకల సమాచారం ఆన్‌లైన్‌లోనే చూసేలా పోర్టల్ అభివృద్ధి జరుగుతోందని చెబుతున్నారు.

# హెచ్.పీవీ వైరస్‌పై షాకింగ్ స్టడీ : ఓరల్ సెలిక్స్ ద్వారా గొంతు క్యాన్సర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా క్యాన్సర్ అనగానే పొగతాగడం, మద్యం సేవించడం లేదా గుట్కా వంటి అలవాట్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ మారుతున్న కాలంతో పాటు వ్యాధుల కారకాలు కూడా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన అంతర్జాతీయ పరిశోధనలు ఒక విస్తుపోయే నిజాన్ని వెలుగులోకి తెచ్చాయి. అదేమిటంటే, గొంతు క్యాన్సర్ రావడానికి ఇప్పుడు పొగాకు కంటే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హ్యూఎ) ప్రధాన కారణం అవుతోంది.

**మారిన క్యాన్సర్ ముఖచిత్రం**

ఒకప్పుడు గొంతు క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువ శాతం వృద్ధులు, పొగాకు వినియోగదారులు ఉండేవారు. కానీ ప్రస్తుత గణాంకాలు భిన్నంగా ఉన్నాయి. పాశ్చాత్య దేశాల్లో నమోదవుతున్న గొంతు క్యాన్సర్ కేసుల్లో సుమారు 70% నుండి 85% వరకు హెచ్.పీవీ వైరస్ వల్లే వస్తున్నాయని వైద్య నిపుణులు నిర్ధారించారు. ముఖ్యంగా హెచ్.పీవీ-16 అనే ప్రమాదకరమైన వైరస్ స్ట్రెయిన్ ఈ వ్యాధికి మూలకారణంగా మారుతోంది. ఇది గొంతులోని టాన్సిల్స్, నాలుక వెనుక భాగం మరియు గొంతు పైభాగంలోని కణజాలాన్ని ప్రభావితం చేస్తుంది.

**సన్నిహిత సంబంధాలు.. వైరస్ వ్యాప్తి**

ఈ వైరస్ వ్యాప్తి చెందే తీరుపై వైద్యులు కీలక హెచ్చరికలు జారీ చేస్తున్నారు. హెచ్.పీవీ అనేది ప్రధానంగా చర్మం నుండి చర్మం తాకడం లేదా సన్నిహిత శారీరక సంబంధాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా ఓరల్ సెక్స్ ద్వారా ఈ వైరస్ నోటిలోకి, గొంతులోకి ప్రవేశిస్తుంది. జీవితకాలంలో ఎక్కువ మంది భాగస్వాములతో సన్నిహితంగా ఉండటం వల్ల ఈ వైరస్ సోకే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన వెంటనే లక్షణాలను చూపదు. దశాబ్దాల పాటు మౌనంగా ఉండి, కణాల్లో మార్పులు చేస్తూ చివరకు క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. మహిళల కంటే పురుషులలో ఈ రకమైన క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉండటం గమనార్హం.

**నివారణ మార్గాలు: అవగాహనే ఆయుధం**

ఈ సమస్య పెరుగుతున్నప్పటికీ, భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తు జాగ్రత్తలతో దీనిని అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్యాన్సర్‌ను నివారించడానికి అందుబాటులో ఉన్న అత్యంత ప్రభావవంతమైన మార్గం వ్యాక్సిన్. ముఖ్యంగా టీనేజ్ వయస్సులోనే (9-14 ఏళ్ల మధ్య) ఈ టీకా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే అనేక రకాల క్యాన్సర్లను అడ్డుకోవచ్చు. సన్నిహిత సంబంధాల్లో జాగ్రత్తలు పాటించడం.. భాగస్వాముల సంఖ్య పరిమితంగా ఉంచుకోవడం ద్వారా వైరస్ సంక్రమణను తగ్గించవచ్చు. గొంతులో గడ్డలు, మింగడంలో ఇబ్బంది, తగ్గని గొంతు నొప్పి లేదా గొంతు బొంగురుపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్య శాస్త్రం ప్రకారం హెచ్.పీవీ సంబంధిత గొంతు క్యాన్సర్లను తొలి దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే చికిత్స కంటే నివారణే మిన్న అనే సూత్రం ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. యువతలో ఈ వైరస్ పట్ల అవగాహన కల్పించడం, వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహించడం ద్వారా రాబోయే తరాలను ఈ ప్రాణాంతక వ్యాధి నుండి కాపాడుకోవచ్చు.

# కూటమి పుట్టలో ఎంతో మంది...అయినా నో యాక్షన్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి రాజకీయ ఆయుధాలు దొరుకుతున్నాయి. కూటమి నేతలు వరసగా ఇబ్బందులో పడుతూంటే వైసీపీ అంతే ధీటుగా వాటిని అందిపుచ్చుకుంటోంది. ఇక ఈ మధ్య కాలంలో అయితే ఏదో ఒక విషయం మీద కూటమిని ఇబ్బంది పెట్టే ప్రయత్నంలో వైసీపీ బిజీగా ఉంది అని అంటున్నారు. ఏలూరు ఎంపీ టీడీపీకి చెందిన యువ నాయకుడు పుట్టా మహేష్ యాదవ్ హైదరాబాద్ లో డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడంతో వైసీపీ దాని మీద గట్టిగానే పట్టు బిగుస్తోంది. పుట్టా మొదలుకుని ఎందరో ఎన్నెన్నో అంటూ ఏకంగా వైసీపీ అధినేత జగన్ లిస్ట్ చెబుతూ కూటమికి షాకిస్తున్నారు.

**తొలి టీడీపీ ఎంపీగా రికార్డు :**

కూటమి ప్రభుత్వం లో ఎంపీగా ఉంటూ దేశంలోనే ఒక సరికొత్త రికార్డుని పుట్టా మహేష్ యాదవ్ నెలకొల్పారని జగన్ విమర్శించారు. ఇప్పటిదాకా దేశ చరిత్రలో ఏ ఎంపీ కూడా ఈ విధంగా డ్రగ్స్ కేసులో నేరుగా పట్టుబడలేదని ఆయన గుర్తు చేశారు. ఇంత జరిగినా టీడీపీ పెద్దలు ఏమి చర్యలు తీసుకుంటున్నారు అంటే నో యాక్షన్ అని జగన్ ఎద్దేవా చేశారు.

**వీరి సంగతేంటి :**

ఏపీలో కూటమి ఎమ్మెల్యేలు అరవై శ్రీధర్ ఆదిమూలం సురేష్ సహా ఎంతో మంది మీద ఆరోపణలు వచ్చినా కూడా కూటమి పెద్దలు కనీసమాత్రంగా అయినా చర్యలు తీసుకోలేదని జగన్ ఆక్షేపించారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ మరో గుంటూర్ ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ల మీద ఆరోపణలు వచ్చినా చంద్రబాబు పట్టించుకోలేదని జగన్ విమర్శించారు. బాబు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం వల్లనే కూటమి ప్రజా ప్రతినిధులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. ఆ వీడియోలు అన్నీ వైరల్ అవుతున్నాయని కంటికి కంబడుతున్నా బాబు ఏమీ యాక్షన్ తీసుకోలేదని జగన్ ఫైర్ అయ్యారు.

**వీటికి పరాకాష్ట :**

ఆఖరికి ఒక మంత్రి పీఏ మహిళా ఉద్యోగి మీద లైంగిక వేధింపులకు పాల్పడినా బాబు ఏమీ చేయలేకపోయారు అని జగన్ హాట్ కామెంట్స్ చేశారు. వీటికి పరాకాష్ట ప్రస్తుత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీద ఆరోపణలు వచ్చినా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుని పట్టుబడినా నో యాక్షన్ అన్నట్లుగా కూటమి పెద్దల తీరు ఉందని జగన్ విమర్శించారు. ఇక నారా లోకేష్ మీద జగన్ ఆరోపణలు చేశారు. స్విమ్మింగ్ పూ లో డ్యాన్సులు వేసినా యాక్షన్ లేదని అమ్మాయిలు కనిపిస్తే ఏదో ఒకటి చేయాలన్న బాలయ్య మీద యాక్షన్ లేదని ఇదీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీరు అని జగన్ ఘాటుగా విమర్శించారు.

# ప్రశాంత్ కిషోర్ సైలెంట్.. పీకే వ్యూహాలకు డిమాండ్ తగ్గిందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ వ్యవహారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో దేశంలో ఎక్కడ ఎన్నిక జరిగినా ప్రశాంత్ కిషోర్ ప్రస్తావన ఎక్కువగా ఉండేది. పార్టీలు, బడా నేతలు ఆయన నుంచి రాజకీయ వ్యూహాలను ఆశించేవారు. 2014 సార్వత్రిక ఎన్నికల నుంచి దేశ రాజకీయాల్లో ప్రశాంత్ కిషోర్ హవాయే నడిచింది. ఆయన వ్యూహాలతో చాలా రాష్ట్రాల్లో అధికారం చేతులు మారిందని, నేతల తలరాత తారుమైరందని ప్రచారం జరిగింది. అయితే 2014 తర్వాత ఫస్ట్ టైం ప్రశాంత్ కిషోర్ ప్రస్తావన లేకుండా దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్నాయి. 2014లో ప్రధాని మోదీ కోసం పనిచేయడం ద్వారా ప్రశాంత్ కిషోర్ దేశంలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2014లో ప్రధాని మోదీ తరఫున పనిచేసిన ప్రశాంత్ కిషోర్ ఆ తర్వాత దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రముఖ పార్టీలకు వ్యూహాలను అందించారు. ఏపీలో వైసీపీ, తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఇలా ఆయన పనిచేసిన పార్టీలు అన్నీ ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ఘన విజయం సాధించాయి. దీంతో ప్రశాంత్ కిషోర్ కు దేశవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో తన సొంత రాష్ట్రం బిహార్ లో ప్రత్యేకంగా జన సురాజ్ పేరుతో ప్రశాంత్ కిషోర్ పార్టీని ప్రారంభించారు. గత ఎడాది జరిగిన ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోరంగా ఓటమి చెందింది. దీంతో ప్రశాంత్ కిషోర్ క్రేజ్ ఆమాంతంగా పడిపోయిందని అంటున్నారు. ఈ కారణంగానే ప్రస్తుత ఎన్నికల్లో ఆయన వ్యూహాలను ఎవరూ కోరుకోవడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ గతంలో పనిచేసిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు కానీ, అధికారం ఆశిస్తూ ఎన్నికల రణ క్షేత్రంలోకి దిగిన పార్టీలు కానీ ప్రశాంత్ కిషోర్ వ్యూహాల కోసం ప్రయత్నించిన దాఖలాలు కనిపించడం లేదు. తమిళనాడులో కొత్తగా ప్రారంభించిన టీవీకే పార్టీ మొదట్లో ప్రశాంత్ కిషోర్ ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆ పార్టీ కూడా ప్రశాంత్ కిషోర్ తో చర్చలను నిలిపివేసినట్లు చెబుతున్నారు. ప్రశాంత్ కిషోర్ తో పనిచేయించుకోవాలంటే చాలా ఖరీదైన వ్యవహారమని, కానీ ఆయన వ్యూహాలు మాత్రం ఎందుకు పనిచేయవని బిహార్ ఎన్నికలతో తేలిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. గెలిచే పక్షాన్ని ఎంచుకుని లాభపడటం తప్ప, ప్రశాంత్ కిషోర్ చేసింది, చేయగలిగింది ఏమీ లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుత ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రశాంత్ కిషోర్ ను దూరం పెట్టినట్లు చెబుతున్నారు.

# జగన్ కి షర్మిల సవాల్...లాజిక్ తోనే !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత వైఎస్ జగన్ కి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సరికొత్తగా సవాల్ చేశారు లాజిక్ పాయింట్ తోనే ఆమె ఈ చాలెంజ్ చేశారు అని చెప్పాలి. ఈ సవాల్ స్వీకరించి జగన్ అన్నా అని ఆమె డైరెక్ట్ గానే డిమాండ్ చేశారు. నిజానికి ఇది వైసీపీకి ఇరకాటంగా ఉండేలాగానే కనిపిస్తోంది. చెల్లెమ్మ అదను చూసి మరీ ఇచ్చిన ఈ సవాల్ షాక్ కి వైసీపీ నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో అన్న చర్చ అయితే సాగుతోంది.

**ఈసీకి వ్యతిరేకంగా :**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ మీద ఇండియా కూటమి ఎంపీలు అంతా కలసి అభిశంసన తీర్మానం ఇచ్చారు. దాని మీద ఏకంగా 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరంతా విపక్షంలోని ఎంపీలు. కేంద్ర ఎన్నికల సమంఘం ప్రధానాధికారిగా జ్ఞానేశ్వర్ పని తీరు మీద సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ అభిశంసన తీర్మానం ఇచ్చారు. ఇపుడు షర్మిల జగన్ కి కోరేది ఏంటి అంటే ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ మీద విపక్షాలు మొత్తం కలిసి పెడుతున్న అభిశంసన తీర్మానానికి వైసీపీ తరఫున మద్దతు ఇవ్వాలని. వైసీపీ పెద్దలు సత్తా ఉంటే ముందు ఆ పని చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**దొంగ ఏడుపులు అంటూ :**

రాష్ట్రంలో ఈవీఎంల వల్లనే తాము ఓటమి చెందామని ఎన్నికలో ఓటమి తరువాత వైసీపీ నేతలు దొంగ ఏడుపులు ఏడ్చారు కదా అని షర్మిల ఎద్దేవా చేశారు. అక్క చెల్లెమ్మల ఓట్లు ఎక్కడికి పోయాయో అని కూడా కన్నీరు పెట్టారు కదా అని ఆమె జగన్ మీద సెటైర్లు పేల్చారు. మరి ఇపుడు ఏకంగా ఈసీ మీదనే అభిశంసన తీర్మానం ప్రవేశపెడుతున్నపుడు వైసీపీకి మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం ఏముంటుందని ఆమె ప్రశ్నించారు.

**చిత్తశుద్ధి ఉంటే :**

ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలు ఎన్నుకున్నది కాదని ఈవీఎంలతో ఏర్పడింది అని వైసీపీ నేతలు విమర్శిస్తూ వస్తున్నారు కదా ఇపుడు ఈసీ మీద అభిశంసన తెలియచేసే అవకాశాన్ని ఎందుకు వాడుకోరని ఆమె నిలదీశారు. నిజంగా వైసీపీకి చిత్త శుద్ధి ఉంటే ఇండియా కూటమి తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. తాను మోడీకి దత్తపుత్రుడు కాను అని నిరూపించుకునేందుకు అయినా జగన్ ఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు ఇచ్చిన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆమె సలహా ఇచ్చారు.

కేంద్ర ఎన్నికల సంఘం విపక్షాలను ఇబ్బందులు పెడుతూ రాజ్యాంగానికి విరుద్ధమైన తీరులో వ్యవహరిస్తోంది అని షర్మిల మండిపడ్డారు. మొత్తానికి షర్మిల చేసిన ఈ డిమాండ్ మీద వైసీపీ పెద్దలు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. ఇది ఎపుడూ వైసీపీని జగన్ ని విమర్శించినట్లుగా షర్మిల చేయలేదు, ఒక ఇష్యూని ముందు పెట్టి వైసీపీని ఇరకాటంలో పెట్టారు. దాంతో అంతా వైసీపీ ఏమి చేయబోతోంది అని ఎదురుచూస్తున్నారు.

# మరోసారి బాబు పవన్- ఉత్కంఠ రేపుతున్న భేటి



**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం పదిహేను రోజుల తేడాలో మరోసారి టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భేటీ కాబోతున్నారు. చంద్రబాబుని ఆయన నివాసంలో బుధవారం పవన్ కలవబోతున్నారు అని అంటున్నారు. ఈ భేటీలో ఏ ఏ అంశాలు చర్చకు వస్తాయి అన్నది అంతటా చర్చ సాగుతోంది. ఈ నెల 3న చంద్రబాబు పవన్ ల భేటీ ఉండవల్లి నివాసంలో జరిగింది. మళ్ళీ ఇంత త్వరగా భేటీ జరగడం పట్ల అయితే ఆసక్తి నెలకొంది.

ఇదిలా ఉంటే ఈ భేటీలో తాజా రాజకీయ పరిణామాలు చర్చకు వస్తాయని అంటున్నారు. అంతే కాదు నామినేటెడ్ పదవులతో పాటు ఇతర అంశాలు కూడా చర్చకు వచ్చే ఆస్కారం ఉందని భావిస్తున్నారు. ఇక మంత్రి వర్గ విస్తరణ తొందరలో ఉంటుందని భావిస్తున్న క్రమంలో దాని మీదనే సోషల్ మీడియా మెయిన్ స్ట్రీమ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్న క్రమంలో ఆ అంశాలు కూడా చర్చకు వస్తాయని అంటున్నారు.

**పుట్టా ఇష్యూ సైతం :**

ఇక ఏపీలో హాట్ హాట్ డిస్కషన్ పాయింట్ గా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ఇష్యూ ఉందని అంటున్నారు. దాంతో దీని మీద ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం షోకాజ్ నోటీసుని ఆయనకు జారీ చేసింది. వివరణ ఇచ్చేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. అయితే ఈ విషయం మీద వైసీపీ అయితే రాజకీయ రచ్చ చేస్తోంది. దాంతో దీని మీద కూడా ఈ ఇద్దరి భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు అలాగే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇష్యూ మీద అయితే వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టింది. దాంతో ఈ విషయం మీద కూడా చర్చిస్తారా అన్నది కూడా ప్రచారంలో ఉంది.

**స్థానిక సంస్థల గురించి :**

ఇక ఏపీలో చూస్తే మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు పదవీ కాలం ముగిసింది. పంచాయతీలకు తొందరలో ముగియబోతోంది. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా చర్చిస్తారా అన్నది కూడా అనుకుంటున్నారు. అలాగే స్థానిక ఎన్నికలను సాధ్యమైనత త్వరగా నిర్వహించాలని కూటమి పార్టీలకు క్యాడర్ నుంచి ఒత్తిడి వస్తోంది. దాంతో ఈ ఇష్యూ కూడా కీలకంగా మారుతోంది. ఇక చూస్తే రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సుకు, అలాగే తాజాగా జరిగిన మంత్రి వర్గ సమావేశానికి పవన్ హాజరు కాలేదు. దాంతో ఈ ఇద్దరు నేతలు కలిస్తే అనేక అంశాల గురించి చర్చకు రావచ్చు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సరిగ్గా ఉగాదికి ఒక రోజు ముందు కూటమి పెద్దలు ఇద్దరూ భేటీ కాబోతున్నారు అంటే మ్యాటర్ ఏంటో అన్న ఆసక్తి అయితే అంతటా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఏ ఇష్యూస్ ని చర్చిస్తారో .

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## నేను ఏదైనా చేయగలను..

## క్యూబా స్వాధీనంపై ట్రంప్ వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్యూబాను స్వాధీనం చేసుకోవడంపై దృష్టిసారించారు. ఆ ద్వీప దేశాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్యానించారు. క్యూబా వ్యాప్తంగా.. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. 'క్యూబాను స్వాధీనం చేసుకునే అవకాశం నాకు దక్కుతుందని నేను బలంగా నమ్ముతున్నాను. అది చాలా గొప్ప విషయం. అది నాకు పెద్ద గౌరవం. దాన్ని స్వాధీనం చేసుకోగలను. దానితో నేను ఆశించినది ఏదైనా దక్కించుకోగలను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా.. అమెరికా చమురు ఆంక్షల నేపథ్యంలో క్యూబాలో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో 9.6 మిలియన్ల మంది ప్రజలు అంధకారంలో చిక్కుకుపోయారు. అమెరికా ఆంక్షల వల్ల గత మూడు నెలలుగా క్యూబాకు ఎలాంటి భారీ ఇంధన రవాణా జరగలేదని క్యూబా అధ్యక్షుడు మిగెల్ దియాజ్ కానెల్ గతవారం పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు ఆ దేశ సంబంధిత శాఖ తాజాగా వెల్లడించింది.

## ఆసుపత్రిపై పాక్ వైమానిక దాడి..

## 400కు చేరిన మృతుల సంఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఓ ఆసుపత్రిపై దాడులు జరగ్గా.. వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ అధికారులు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబూల్‌లోని ఓ ఆస్పత్రిపై ఈ దాడులు జరిగాయని అఫ్గాన్ ప్రభుత్వ డిప్యూటీ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రాట్ పేర్కొన్నారు. దాడుల్లో ఇప్పటివరకు 400 మంది మరణించారని.. దాదాపు 250 మంది గాయపడ్డారని వెల్లడించారు. భవనంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి పూర్తిగా దెబ్బతిందని.. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను కూడా వెలికితీస్తున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి లక్ష్యంగా దాడులు చేశామంటూ తమపై అఫ్గాన్ చేస్తున్న ఆరోపణలను పాక్ తీవ్రంగా ఖండించింది. అఫ్గాన్ సైనిక స్థావరాలు, ఉగ్రవాద మౌలిక సదుపాయాలే లక్ష్యంగా తాము కచ్చితమైన దాడులు చేశామని పాక్ సమాచార మంత్రిత్వశాఖ తెలిపింది. పౌరులు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడించింది.

### నన్ను ట్రంప్‌నకు దూరం చేసే ప్రయత్నాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తనకు మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. దేశ విదేశాంగ విధానం విషయంలో ట్రంప్ యంత్రాంగంలోని సభ్యులంతా అతనికి పూర్తిగా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో అధ్యక్షుడు పని పూర్తి చేస్తారనే విశ్వాసంతో ఉన్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల గురించి గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించగా వాన్స్ దాటవేశారు. అప్పుడు ట్రంప్ అక్కడే ఉన్నారు. "మీరు ప్రభుత్వంలోని సభ్యుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. 2015 నుంచి అధ్యక్షుడు చెప్తున్న దానితో నేను ఏకీభవిస్తున్నాను. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండటానికి వీల్లేదు" అని మీడియాకు బదులిచ్చారు. అలాగే ట్రంప్ నాయకత్వాన్ని గత ప్రభుత్వాలతో పోల్చారు. "గత అధ్యక్షుల మాదిరిగా కాకుండా ఇప్పుడు మనకు తెలివైన ప్రెసిడెంట్ ఉన్నారు. ట్రంప్ ఈ పని పూర్తి చేస్తారని, అమెరికా ప్రజలకు మంచి చేస్తారని నమ్ముతున్నాను. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటారని విశ్వసిస్తున్నాను" అని వాన్స్ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం అమెరికా ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడదని, వనరులు భారీగా వృథా అవుతాయని 2024లో వాన్స్ వ్యాఖ్యలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ట్రంప్ దూకుడుగా దాడులకు మొగ్గు చూపగా.. ఉపాధ్యక్షుడు దౌత్యపరంగా పరిష్కారాలు వెతకాలని ఆశించినట్లు తెలుస్తోంది. కానీ ఇప్పుడు ట్రంప్ నిర్ణయాలకే మద్దతు తెలుపుతున్నారు.

## 250 ఉక్రెయిన్ డ్రోన్‌లను

## కూల్చివేసిన రష్యా వైమానిక దళాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన 250 ఉక్రెయిన్ డ్రోన్‌లను వైమానిక రక్షణ దళాలు అడ్డుకున్నాయని రష్యా సోమవారం తెలిపింది. వారాంతంలో మాస్కోపై ప్రయోగించిన 250 డ్రోన్‌లను వైమానిక దళాలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ పేర్కొన్నారు. సోమవారం కొన్ని ప్రధాన విమానాశ్రయాలు కార్యకలాపాలను రద్దు చేయడంతో మేయర్ ఈ ప్రకటన విడుదల చేశారు. మాస్కోను సమీపిస్తున్న మొత్తం 159 డ్రోన్‌లను భద్రతాదళాలు కూల్చివేశాయని అన్నారు. 'రక్షణశాఖలోని వైమానిక విభాగం వృత్తిపరమైన విధికి మరియు అంకితభావానికి ధన్యవాదాలు' అని మేయర్ ఒకపోస్ట్‌లో తెలిపారు. వైమానిక భద్రత దృష్ట్యా రాజధానిలోని డొమోడెడెవో మరియు జుకోవ్స్కీ విమానాశ్రయాలు కార్యకలాపాలను పరిమితం చేశాయని స్థానికమీడియా తెలిపింది. ప్రయాణికులు విమానాల షెడ్యూల్స్‌ను తనిఖీ చేసుకోవాలని సూచించింది. మరో విమానాశ్రయం వ్నుకోవో కూడా కార్యకలాపాలను రద్దు చేసింది.

### పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు..

## వేలాది విమాన సర్వీసులను రద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నాడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన లోక్‌సభలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సంక్షోభం వల్ల భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు అని ఆయన స్పష్టం చేశారు. అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# అమెరికా యుద్ధ నౌకలో అగ్ని ప్రమాదం..

# వందలాది సైనికులకు అస్వస్థత

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా కొనసాగిస్తోన్న ఆపరేషన్‌లో అమెరికా విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ (జూూ ఉవతీజీశ్రీట ఖీ ఈనీతీట) ఎర్రసముద్రంలో తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఇటీవల ఈ నౌకలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఘటనను అమెరికా సైనిక అధికారులు ధ్రువీకరించారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. వారం క్రితం జెరాల్డ్ నౌకలోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అనంతరం వెంటిలేషన్ డక్ట్‌ల ద్వారా ఇతర భాగాలకు మంటలు వ్యాపించాయి. నౌకలోని పలు ప్రదేశాల్లో దాదాపు 30 గంటల పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలో ఉన్న అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఘటన జరిగిన సమయంలో నౌకలో 4,500 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 600 మంది సెయిలర్ల పడకలు అగ్నికి ఆహుతి అయ్యాయి. 30 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాణ నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం వెలువడలేదు. నౌకలో తీవ్రంగా మంటలు చెలరేగినప్పటికీ పెద్ద నష్టం జరగలేదని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. విమాన వాహక నౌక పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. అస్వస్థతకు గురైన సిబ్బందికి చికిత్స అందిస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన కంపార్ట్‌మెంట్లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణంగా అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు సుమారు ఏడు నెలల పాటు సముద్రంలో



మోహరించి ఉంటాయి. అయితే యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పది నెలలుగా జెరాల్డ్ పలు ప్రదేశాల్లో మోహరిస్తూ సముద్రంలోనే ఉంది. మొదట మధ్యధరా సముద్రంలో పనిచేసిన ఈ నౌకను వెనెజువెలాపై దాడి సమయంలో కరేబియన్‌కు మళ్లించారు. ఆ తర్వాత ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా వైపు తరలించారు. ప్రస్తుతం ఈ నౌక ఎర్ర సముద్రం నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా ఓడరేవు వైపు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువకాలం సముద్రంలో మోహరించి ఉండడం వల్ల ఇందులో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## డీఎంకే ప్రభుత్వంపై అన్నాడీఎంకే నేత గౌతమి తీవ్ర స్థాయిలో విమర్శలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడులో అధికార డీఎంకే ప్రభుత్వంపై నటి, అన్నాడీఎంకే నేత గౌతమి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంలో రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని, వారు అభద్రతాభావంతో ఉన్నారని ఆమె ఆరోపించారు. కోయంబత్తూరులో అన్నాడీఎంకే నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జయలలిత హయాంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని గౌతమి గుర్తుచేశారు. ఆమె తన చివరి శ్వాస వరకు మహిళల సాధికారతకు కట్టుబడి ఉన్నారని, వారి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. కానీ, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం మాత్రం మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని విమర్శించారు. మహిళలకు భద్రత, గౌరవం కల్పించడంలో స్టాలిన్ సర్కార్ విఫలమైందని ఆమె దుయ్యబట్టారు. విలాతికులం అత్యాచారం, హత్య ఘటనపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించిన తీరును కూడా గౌతమి తప్పుబట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే మాట్లాడతానని చెప్పడం బాధితురాలి కుటుంబం పట్ల సున్నితత్వం లేకుండా వ్యవహరించడమేనని అన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇది భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి మహిళల హక్కుల కోసం సుమారు 28 నెలలుగా పోరాడుతున్నారని ప్రశంసించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ఉంటుందని, ఇతర పార్టీల ప్రభావం నామమాత్రమేనని గౌతమి జోస్యం చెప్పారు.



# ఆరేండ్లలో ఒక్క ప్రశ్నా లేవనెత్తలేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (మాజీ సీజేఐ) రంజన్ గొగోయ్ తన ఆరేండ్ల పదవీకాలంలో ఒక్క ప్రశ్న కూడా లేవనెత్తకుండానే రాజ్యసభ నుంచి పదవీ విరమణ చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత స్థలంలో ఆలయాన్ని నిర్మించడానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన ధర్మాసనానికి నాయకత్వం వహించిన గొగోయ్‌కు గౌరవ సభ్యత్వం ఇవ్వడంపై అప్పట్లో తీవ్ర విమర్శలే వచ్చాయి. సోమవారం ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన వెంటనే చైర్మన్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ? ఒక ప్రముఖ న్యాయ నిపుణుడిగా, గొగోయ్ అసమానమైన చట్టపరమైన చతురత, అనుభవాన్ని సభ చర్చలకు తీసుకువచ్చారని అన్నారు. ఆయన స్వరం తప్పిపోతుందని తెలిపారు. 2020 మార్చి 16న కేంద్ర ప్రభుత్వం నామినేషన్‌తో రాజ్యసభ సభ్యుడైన గొగోయ్.. ఆరు సంవత్సరాలలో ఒకే ఒక చర్చలో పాల్గొన్నారు. హాజరు శాతం కేవలం 53 శాతం మాత్రమే. గొగోయ్ ప్రసంగం ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, 2023కి మద్దతుగా ఉంది. దీనిని ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను తగ్గించడానికి కేంద్రం ప్రవేశపెట్టింది. కానీ రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీసే బిల్లుకు ఆయన మద్దతు ఇవ్వటం గమనార్హం. ఈ వైఖరి 2017 ట్రిబ్యునల్ నిబంధనలను కొట్టివేసిన గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన ఆదేశానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. తనకు ఎప్పుడు నచ్చితే అప్పుడు రాజ్యసభకు వెళ్తానని గొగోయ్ ఒక ఇంటర్వ్యూలో అనడం గతంలో వివాదాస్పదమైన విషయం విదితమే.

# 192 మందితో లెఫ్ట్‌ఫ్రంట్ తొలిజాబితా

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో జరిగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం సీపీఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ సోమవారం 192 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. వీరిలో పార్టీ అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు కూడా చోటు లభించింది. అలాగే ఈ తొలి జాబితాలో 17 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఈ జాబితాలో అతిముఖ్యంగా చెప్పుకోవాల్సింది నదియా జిల్లాలోని కలిగంజ్ అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా సబీనా యాస్మిన్‌ను బరిలోకి దింపడం. గతేడాది జూన్‌లో టీఎంసీ గూండాల దాడిలో సబీనా యాస్మిన్ కుమార్తె, తొమ్మిదేండ్ల తమన్నా ఖాతున్ మృతి చెందింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిందనే అక్కసుతో సబీనా యాస్మిన్ నివాసంపై టీఎంసీ గుండాలు బాంబులతో దాడి చేయడంతో తమన్నా అక్కడికక్కడే మృతి చెందడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలాగే, మహిళా యువనేత మీనాక్షి ముఖర్జీ ఉత్తరపరా నుంచి, దుమ్‌దుమ్ ఉత్తర్ నుంచి దిప్సితా ధార్‌ను సీపీఐ(ఎం) పోటీలో నిలిపింది. జాదవ్‌పూర్ నుంచి కొల్‌కతా మాజీ మేయర్ బికాష్ రంజన్ భట్టాచార్య, రాణిబంధ్ నుంచి సీనియర్ మైనార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కూడా దెబ్లినా హెంబ్రామ్ వంటి ప్రముఖులు తొలి జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థుల్లో ఉన్నారు. లెఫ్ట్‌ఫ్రంట్‌లో సీపీఐ(ఎం)తో పాటు, సీపీఐ, సీపీఐ(మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్‌ఎఫ్), ఆల్-ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బీ), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌సీపీఐ), మార్క్సిస్ట్ ఫార్వర్డ్ బ్లాక్ (ఎంఎఫ్‌బీ) ఉన్నాయి. వీటిలో తొలిజాబితాలో ఎఐఎఫ్‌బీ 19 స్థానాల నుంచి అభ్యర్థులను నిలిపింది. సీపీఐ 12 స్థానాల నుంచి, ఆర్‌ఎస్‌పి 11 స్థానాల్లో నుంచి పోటీ చేస్తోంది. ఎంఎఫ్‌బీ ఒక్క స్థానం నుంచి, ఆర్‌సీపీఐ ఒక్క స్థానం నుంచి పోటీ చేస్తున్నాయి. ఈ తొలి జాబితాలో

148 స్థానాల నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తొలిజాబితాలో సీపీఐ(మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్, ఐఎస్‌ఎఫ్‌లు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. అలాగే, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఎజెయూపీ) కూడా సీపీఐ(ఎం)తో చర్చలు జరుపుతోంది. పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కాగా, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సొంతంగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో లెఫ్ట్‌ఫ్రంట్‌తో ఆ పార్టీ పొత్తు కుదుర్చుకోలేదు. కాబట్టి కాంగ్రెస్, లెఫ్ట్‌ఫ్రంట్ మధ్య దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న అవగాహన ముగిసినట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఒక్కసారిగా తగ్గిన ధరలు!



బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోతున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన పసిడి ధరలు తాజాగా గణనీయంగా క్షీణించాయి.ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న సమయంలో ఈ స్థాయిలో ధరలు తగ్గడం సాధారణ ప్రజలకు ఉపశమనంగా మారింది.తాజా మార్కెట్‌లో తులం బంగారం ధరలో పెద్ద ఎత్తున తగ్గుదల నమోదైంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజులోనే సుమారు రూ.2,240 వరకు తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర కూడా దాదాపు రూ.1,640 మేర పడిపోయింది. ఇదే సమయంలో వెండి ధరలో కూడా భారీ పతనం కనిపించింది. ఒకే రోజులో వెండి ధర దాదాపు రూ.5,000 వరకు తగ్గింది.ధరలు తగ్గిన తర్వాత న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,57,420గా ఉంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర
రూ.1,44,300 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి ధర తగ్గిన తర్వాత కిలోకు సుమారు రూ.2,70,000 వద్ద ట్రేడవుతోంది. అలాగే కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,570గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,450 వద్ద ఉంది. మరోవైపు 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,420గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,44,300 వద్ద కొనసాగుతోంది.బంగారం, వెండి ధరలు తగ్గడానికి పలు కారణాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొంత తగ్గడం, అలాగే తీసుకుంటున్న వడ్డీ రేట్ల నిర్ణయాలు కూడా బంగారం ధరలపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గత కొన్ని రోజులుగా ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించి లాభాలు పొందడం వల్ల మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు తగ్గుముఖం పట్టాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# వంటగ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



వంటగ్యాస్ సరఫరాపై కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100శాతం ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయబోతున్నట్లు ప్రకటించింది.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని స్పష్టం చేసింది. హర్మూజ్ దగ్గర భారతీయ నౌకలు కూడా సురక్షితంగా ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశంలో వంట గ్యాస్ కొరత ప్రజల్లో
ఆందోళన కలిగిస్తోంది. మున్ముందు ధర మరింత పెరుగుతుందనే ఆందోళనతో గృహ వినియోగదారులు గ్యాస్‌ను కొనుగోలు చేయడానికి బారులు తీరుతున్నారు. అసలు, గ్యాస్ దొరుకుతుందా, లేదా అనే భయాలు కూడా ప్రజల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పందించింది. వంటగ్యాస్ గురించి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది. అవసరం లేకపోయినా ఆందోళనలతో బుక్ చేయవద్దని సూచించింది. దేశంలో గృహ అవసరాలకు తగిన వంటగ్యాస్ అందుబాటులో ఉందని వెల్లడించింది. ఉత్పత్తిని పెంచాలని కంపెనీలను కూడా ఆదేశించినట్లు తెలిపింది.

# పెట్టుబడుల సలహాదార్లకు 'లైట్ టచ్' జరిమానా విధానం

పెట్టుబడుల సలహా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పలు ప్రతిపాదనలను సిద్ధం చేసే ప్రయత్నంలో ఉంది. ఇందులో భాగంగా ప్రామాణీకరించిన లైట్-టచ్(తేలికపాటి) జరిమానా విధానాన్ని, డిజిటల్ రెగ్యులేటరీ మార్గనిర్దేశక ప్లాట్‌ఫాం, కామన్ అడ్వెర్టజ్‌మెంట్ కోడ్ తదితరాలు తీసుకురానున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్(ఏఆర్ఐఏ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం పెట్టుబడుల సలహా వ్యవస్థ ఒక ముఖ్యమైన పరివర్తన దశలో ఉందని అన్నారు. 1,000కి పైగా నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు(ఐఏలు) దేశంలో ఉండగా.. అందులో 470 మంది వ్యక్తులు, 530 సంస్థలున్నాయి. పారదర్శకత, నిష్పాక్షికతతో పాటు నిబంధనలను పాటించేలా చూడడం కోసం ప్రామాణీకరించిన లైట్ టచ్ జరిమానా విధానాన్ని తీసుకు వచ్చేందుకు పనిచేస్తున్నట్లు వివరించారు. 'సెబీ సేతు' పేరిట ఐఏలకు సరళీకృత, ఎండ్-టు-ఎండ్ నియంత్రణ మార్గదర్శకత్వం అందించేందుకు డిజిటల్ ప్లాట్‌ఫాంనూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అన్ని ఇంటర్మీడియటరీలకు కార్యకలాపాల సవాళ్లు తగ్గించడానికి, కమ్యూనికేషన్‌లో స్థిరత్వాన్ని మెరుగుపరచేందుకు సాధారణ వ్యాపార ప్రకటనల స్మృతి (కామన్ అడ్వర్టయిజ్‌మెంట్ కోడ్)ని సెబీ సిద్ధం చేస్తోంది. మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ల(ఎమ్ఎఫ్‌డీ)కు సంబంధించిన ప్రస్తుత నియంత్రణ విధానాన్ని సమీక్షించేందుకు కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. మదుపర్ల సంఖ్య పెరుగుతున్నా, నమోదిత పెట్టుబడుల సలహాదార్ల సంఖ్య తగ్గుతుండడంపై పాండే ఆందోళన వ్యక్తం చేశారు.

## మళ్లీ క్షిపణులతో విరుచుకుపడ్డ ఉత్తర కొరియా..

# జపాన్ సముద్రంలో ఉద్రిక్తత..!



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, తూర్పు ఆసియాలో ఉత్తర కొరియా మరోసారి తన సైనిక ప్రతాపాన్ని చాటింది. సుమారు 10 బాలిస్టిక్ క్షిపణులను జపాన్ సముద్రం వైపు ప్రయోగించి అంతర్జాతీయ సమాజంలో కలకలం సృష్టించింది.ఈ భారీ ప్రయోగాలను దక్షిణ కొరియా సైన్యం ధృవీకరించినప్పటికీ, ప్రయోగించిన క్షిపణుల పూర్తి సామర్థ్యం మరియు అవి ప్రయాణించిన ఖచ్చితమైన పరిధిని (రేంజ్) అంచనా వేయడం ప్రస్తుతం రక్షణ నిపుణులకు సవాలుగా మారింది.అమెరికా మరియు దక్షిణ కొరియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలకు కౌంటర్ గానే కిమ్ జోంగ్ ఉన్ ఈ చర్యకు పాల్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తమ సరిహద్దుల్లో శత్రుదేశాల కదలికలను సహించబోమని హెచ్చరిస్తూ, ఒకేసారి ఇన్ని క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన ఆయుధ బలాన్ని ఉత్తర కొరియా ప్రదర్శించింది. ఈ చర్య ఆ ప్రాంతంలో శాంతి చర్చలకు బదులు ఘర్షణ వాతావరణాన్ని మరింత పెంచేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అణ్వాయుధ సామర్థ్యం ఉన్న ఉత్తర కొరియా, ఇలాంటి క్లిష్ట సమయంలో క్షిపణి పరీక్షలు చేపట్టడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఏ చిన్న పొరపాటు జరిగినా అది భారీ యుద్ధానికి దారితీసే అవకాశం ఉన్నందున, ఐక్యరాజ్యసమితి మరియు ఇతర దేశాలు ఉత్తర కొరియా చర్యలను నిశితంగా గమనిస్తున్నాయి. దక్షిణ కొరియా మరియు జపాన్ దేశాలు తమ భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేశాయి. అమెరికాతో కలిసి రాబోయే పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి. ఉత్తర కొరియా కేవలం హెచ్చరికలతో ఆగకుండా తన ఆయుధ సంపత్తిని నిరంతరం పెంచుకుంటూ పోతుండటం, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో మరిన్ని సవాళ్లను సృష్టించేలా ఉంది. ఈ తాజా పరిణామం ఆసియా ఖండంలో ఆయుధ పోటీని మరింత వేగవంతం చేసే ప్రమాదం ఉంది.

## ఫోన్‌పే ఐపీఓకు బ్రేక్.....




ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తన పబ్లిక్ ఆఫర్ ప్రక్రియకు బ్రేకులు వేసింది. ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీకి అనుమతులు వచ్చాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఐపీఓ ప్రక్రియను వాయిదా వేశామని కంపెనీ సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లలో స్థిరమైన ర్యాలీ వచ్చిన తర్వాత తిరిగి ఐపీఓ ప్రక్రియను కొనసాగిస్తామని, త్వరలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంటుందని ఆశిస్తున్నట్లు సమీర్ చెప్పారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు త్వరగా శాంతించాలని ఆశిస్తున్నాం. యుద్ధ పరిస్థితుల వల్ల దేశీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉందన్నారు. దేశీయంగా అతిపెద్ద డిజిటల్ పేమెంట్ యాప్‌గా ఉన్న ఫోన్‌పే 2025 నాటికి 65 కోట్ల యూజర్లు, 4.7 కోట్ల మర్చంట్లతో ఆధిపత్యం కలిగి ఉంది. ఐపీఓ ద్వారా రూ. 10 వేల కోట్ల వరకు నిధుల సమీకరణకు కంపెనీ సిద్ధంగా ఉంది. దీనికి సెబీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది

## 4.9 శాతానికి దిగొచ్చిన నిరుద్యోగ రేటు



పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు స్వల్పంగా దిగొచ్చింది. గణాంకాలు, పథక అమలు మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన కార్మిక సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి దేశంలో నిరుద్యోగ రేటు 4.9 శాతానికి తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 5 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం దిగిరావడమే ఇందుకు కారణం. సమీక్షించిన నెలలో పట్టణ నిరుద్యోగ రేటు 6.6 శాతానికి తగ్గింది. ఇది గతేడాది డిసెంబర్ నాటి స్థాయి అని పీఎల్ఎఫ్ఎస్ డేటా పేర్కొంది. ఇదే సమయంలో గ్రామీణ నిరుద్యోగం 4.2 శాతంతో స్థిరంగా కొనసాగుతోంది. మహిళల్లో కూడా నిరుద్యోగం 5.6 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గింది. ఈ క్షీణత గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ నమోదైంది. ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 39.7 శాతం నుంచి 40 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 25.5 శాతం వద్దే ఉంది.

## ఫిబ్రవరిలో తగ్గిన ఎగుమతులు




ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశ వస్తువుల ఎగుమతులు స్వల్పంగా 0.81 శాతం తగ్గి 36.61 బిలియన్ డాలర్ల(రూ. 3.38 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. ఇదే నెలలో దిగుమతులు 24.11 శాతం పెరిగి 63.71 బిలియన్ డాలర్ల(రూ. 5.88 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. ఫలితంగా సమీక్షించిన నెలలో వాణిజ్య లోటు 27.1 బిలియన్ డాలర్ల(రూ. 2.50 లక్షల కోట్ల)కు చేరుకుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇది గతేడాది నమోదైన 14 బిలియన్ డాలర్లతో పోలిస్తే దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ దేశ ఎగుమతులు మెరుగ్గా కొనసాగుతున్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అన్నారు. అయితే, బంగారం, వెండి డిమాండ్ కారణంగా దిగుమతులు 24 శాతం పెరిగాయని వాణిజ్య శాఖ తెలిపింది. ఈ నెలలో మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, కీలక హోర్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాలతో మార్చి గణాంకాలు ప్రభావితం అవుతాయని, లాజిస్టిక్స్ ఖర్చులను పెంచుతాయని రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.

## 11 నెలల గరిష్టానికి టోకు ద్రవ్యోల్బణం



కొత్త బేస్ ఇయర్ సిరీస్‌లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా రెండో నెలా పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో టోకు ద్రవ్యోల్బణం 11 నెలల గరిష్ఠ స్థాయి 2.13 శాతానికి చేరింది. కూరగాయల ధరలు కొంత తగ్గినప్పటికీ మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ ధరలు పెరగడం, తయారీ వస్తువులతో పాటు ఇతర కమొడిటీలపై ఒత్తిళ్లతో సమీక్షించిన నెలలో టోకు ద్రవ్యోల్బణం పెరిగింది. ఇంధన ధరలు గరిష్ఠ స్థాయిల వద్దే కొనసాగుతుండటం కూడా ప్రభావితం చేశాయి. అంతకుముందు జనవరిలో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 1.81 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. గత నెలలో ప్రధానంగా తయారీ ఉత్పత్తులు మొత్తంగా టోకు ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమయ్యాయి. మిగిలిన వాటిలో ఆహార ఉత్పత్తులు, టెక్స్‌టైల్ తయారీలో ధరలు ఖరీదవడం కూడా కారణం.

## ఉదయం లేవగానే ఇలా అనిపిస్తుందా?



ఉదయం నిద్రలేవగానే ఒక్కసారిగా తల తిరిగినట్లు అనిపిస్తోందా? కళ్లు మసకబారి అడుగు తడబడుతోందా? చాలామంది దీనిని కేవలం నిద్ర సరిపోలేదనో లేదా అలసట అనో భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ పదే పదే ఇలా జరగడం మీ ఆరోగ్యం విషయంలో శరీరం ఇస్తున్న ఒక హెచ్చరిక కావచ్చు. చాలామంది ఉదయం నిద్రలేవగానే మంచం మీద నుంచి లేవడానికి ప్రయత్నిస్తే ఒక్కసారిగా తల తిరిగినట్లు, కళ్లు మసకబారినట్లు లేదా శరీరం సమతుల్యత కోల్పోయినట్లు అనిపిస్తుంది. కొద్దిసేపటి తర్వాత ఇది తగ్గిపోవడంతో దీనిని సాధారణ బలహీనతగా భావించి వదిలేస్తుంటారు. కానీ ఇలా పదే పదే జరుగుతుంటే అది మీ శరీరం ఇస్తున్న ప్రమాద సంకేతం కావచ్చని వైద్యులు చెబుతున్నారు. మనం పడుకున్నప్పుడు రక్తప్రసరణ ఒకలా ఉంటుంది. అకస్మాత్తుగా లేచి నిలబడినప్పుడు గురుత్వాకర్షణ ప్రభావం వల్ల రక్తం కాళ్ల వైపు మళ్లుతుంది. దీనివల్ల మెదడుకు రక్తప్రసరణ క్లుప్తంగా తగ్గి తల తిరుగుతుంది. దీనిని వైద్య పరిభాషలో ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ అంటారు. రాత్రంతా మనం నీరు తాగకుండా నిద్రపోతాం. పగటిపూట కూడా తక్కువ నీరు తాగే అలవాటు ఉంటే ఉదయం కల్లా శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. దీని ప్రభావం మెదడు పనితీరుపై పడి తల తిరగడానికి కారణమవుతుంది. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు మెదడుకు అందాల్సిన ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. ఫలితంగా తల తిరగడం, అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య ముఖ్యంగా మహిళలు మరియు వృద్ధులలో ఎక్కువగా కనిపిస్తుంది.రాత్రి పూట భోజనం తక్కువగా చేసినా లేదా డయాబెటిస్ మందులు వాడుతున్నా.. ఉదయం కల్లా రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోవచ్చు. దీనివల్ల తల తిరగడంతో పాటు వణుకు, చెమట పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నరాల వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి విటమిన్ బి12 అవసరం. దీని లోపం ఉన్నా లేదా లోపలి చెవిలో ఏవైనా సమస్యలు ఉన్నా శరీర సమతుల్యత దెబ్బతింటుంది. అధిక ఒత్తిడి, నిద్రలేమి కూడా దీనికి అదనపు కారణాలు కావచ్చు.

## రాత్రి పడుకునే ముందు ఐస్ క్రీం తింటే..



రాత్రి భోజనం తర్వాత.. చల్లచల్లని ఐస్ క్రీం తింటూ ఆ తీపిని ఆస్వాదించడం ఎవరికి ఇష్టం ఉండదు? కానీ ఆ ఒక్క ముక్క ఐస్ క్రీం మీ శరీరంలో ఎలాంటి మార్పులు తెస్తుందో మీకు తెలుసా?మీరు నిద్రపోయే సమయంలో మీ జీర్ణవ్యవస్థపై అది ఎంతటి భారాన్ని మోపుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? రాత్రిపూట ఐస్ క్రీం తినడం మీ ఆరోగ్యానికి పొంచి ఉన్న ప్రమాదమా? రాత్రి భోజనం ముగిశాక చల్లచల్లగా, తియ్యగా ఉండే ఐస్ క్రీం తినడం చాలా మందికి ఒక అలవాటు. ఆ రుచి ఇచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది. అయితే పడుకునే ముందు ఐస్ క్రీం తినడం వల్ల శరీరంలో జరిగే మార్పులు, అది మీ ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? దీనికి సంబంధించి ఆరోగ్య నిపుణులు ఆసక్తికర విషయాలు చెబుతున్నారు. ఐస్ క్రీంలో చక్కెర, కొవ్వు అధికంగా ఉంటాయి. మనం నిద్రపోతున్నప్పుడు మన శరీర మెటబాలిజం మందగిస్తుంది. రాత్రి పూట తీసుకునే ఈ భారీ కేలరీలను కరిగించడం శరీరానికి కష్టమవుతుంది. ఫలితంగా ఆ కేలరీలన్నీ కొవ్వుగా మారి, ముఖ్యంగా పొట్ట భాగంలో పేరుకుపోతాయి. ఇది దీర్ఘకాలంలో స్థూలకాయానికి దారితీస్తుంది. ఐస్ క్రీం తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. ఆ తర్వాత అంతే వేగంగా పడిపోతాయి. ఈ ఆకస్మిక మార్పుల వల్ల నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. కొంతమందికి రాత్రి పూట చెమటలు పట్టడం, ఆందోళనగా అనిపించడం లేదా పదే పదే మెలుకువ రావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రాత్రి పూట వాతావరణం చల్లగా ఉంటుంది. ఆ సమయంలో ఐస్ క్రీం వంటి చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దగ్గు లేదా జలుబు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సైనస్ లేదా అలర్జీ సమస్యలు ఉన్నవారు రాత్రి పూట ఐస్ క్రీంకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

## ఆయుష్షునిచ్చే బ్రహ్మాస్త్రం శతావరి



శతావరి, యాస్పరస్ రెసిమోసిస్‌గా అని పిలిచే ఈ ఔషధ మొక్కతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. దీని భూగర్భ దుంపలలో స్టెరాయిడల్ గ్లైకోసైడ్‌లు వంటి రసాయనాలు ఉంటాయి. శతావరి చూర్ణం జీర్ణ సమస్యలు, అల్సర్లు, గ్యాస్, కిడ్నీ రుగ్మతలు, కంటి చూపు మెరుగుదలకు తోడ్పడుతుంది. కీళ్ల నొప్పులు, నరాల బలహీనతలకు లేపనంగా వాడవచ్చు. స్త్రీల రుతు, గర్భాశయ సమస్యలకు, మానసిక ఒత్తిడి తగ్గించడానికి కూడా ప్రయోజనం. మన చుట్టూ ఉన్న ప్రకృతిలో అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఉన్నాయి. వాటిలో శతావరి ఒకటి. ఇది చూసేందుకు అలంకరణ మొక్కలా కనిపించినా, దాని ప్రయోజనాలు అపారమైనవి. శతావరి మొక్క సాధారణంగా పంట చేలల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీనిని కొన్ని ప్రాంతాల్లో పిల్లి పీచర గడ్డలు, పిల్లి తీగలు, చందమామ గడ్డలు వంటి స్థానిక పేర్లతో పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం యాస్పర్?గస్? రెసిమోసిస్?. ఇది తీగ జాతికి చెందిన ముళ్ల మొక్క, ఇది పంట చేలకు రక్షణగా కూడా నిలుస్తుంది.ఆయుర్వేదం ప్రకారం, శతావరి మొక్కతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇది పలు వ్యాధులకు ఔషధంగా ఉపయోగిస్తారు. అనేక ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ దీనిని వాడుతారు. శతావరి బంగాళాదుంపలు, ముల్లంగి, క్యారెట్ లానే భూగర్భంలో దుంపలను కలిగి ఉంటుంది. ఈ దుంపలు తీపి, చేదు రుచిని కలిగి ఉంటాయి. ఈ దుంపల్లో స్టెరాయిడల్ గ్లైకోసైడ్, పాలీసైక్లిక్ ఆల్కలాయిడ్, అస్పర్గమైన్, డైహైడ్రోఫెనామ్, ట్రీన్ రెసిమోసోల్ వంటి రసాయనాలు ఉంటాయి. ఈ రసాయన సంపద కారణంగానే శతావరి అనేక వ్యాధులను తగ్గించడంలో తోడ్పడుతుంది. 1. జీర్ణ సమస్యల నివారణ: ఒక టీ స్పూన్ శతావరి చూర్ణాన్ని ఒక చిన్న టీ గ్లాస్ నీటిలో కలిపి రోజూ తాగడం వల్ల జీర్ణ వ్యవస్థలోని అల్సర్లు తగ్గుతాయి. అలాగే గ్యాస్ సమస్య ఉండదు. దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఇది ఎంతో ప్రయోజనకారి. ఇది జీర్ణ శక్తిని కూడా పెంచుతుంది, ఆకలి లేని వారికి ఉపయుక్తంగా ఉంటుంది. 2. కీళ్ల నొప్పులు, నరాల బలహీనత: శతావరి చెట్టు వేరును సేకరించి, గంధం లాగా అరగదీసి కీళ్ల నొప్పులు, నరాల బలహీనత ఉన్న ప్రదేశాల్లో లేపనంగా రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా, ఆ భాగాలు దృఢంగా మారతాయి. 3. కిడ్నీ, మూత్ర సంబంధిత సమస్యలు: కిడ్నీ వ్యాధులు ఉన్నవారు శతావరి చూర్ణాన్ని రాత్రి నిద్రకు ముందు కాస్త కండ చక్కెరతో కలిపి తీసుకోవడం వల్ల మూత్ర సంబంధిత సమస్యలు తగ్గుతాయి. 4. కంటి చూపు మెరుగుదల: కిడ్నీ సమస్యలకు తీసుకునే విధంగానే శతావరి చూర్ణాన్ని కండ చక్కెరతో కలిపి తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు తగ్గి, ముఖ్యంగా కంటి చూపు మెరుగుపడుతుంది. 5. పోషకాహార లోపం: శతావరి దుంపల్లో అనేక పోషకాలు ఉంటాయి. పోషకాహార లోపం ఉన్నవారు ఈ దుంపలను తినవచ్చు. ఈ దుంపలను ఎండబెట్టి, దంచి, జల్లించి చూర్ణం తయారు చేసి, ఒక టీ స్పూన్ మోతాదులో తిని, తర్వాత ఒక గ్లాస్ పాలను తాగడం వల్ల శరీరం పుష్టిగా, దృఢంగా మారి, బలహీనతలు తొలగిపోతాయి.

# జామకాయను తొక్కతో తింటే ఏమవుతుంది..?



తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే పండు ఏదైనా ఉందంటే అది జామ మాత్రమే. విటమిన్ సి, ఎ, బి, కె లతో పాటు ఫైబర్ పుష్కలంగా ఉండే జామకాయను పేదవాని ఆపిల్ అని పిలుస్తారు. అయితే జామకాయను తినే విషయంలో చాలామందికి ఒక సందేహం ఉంటుంది.. దానిని తొక్కతో పాటు తినాలా లేక తొక్క తీసేసి తినాలా? అలాగే పండు కంటే కాయ మేలా? దీనిపై ప్రముఖ పోషకాహార నిపుణురాలు దీప్షిక సోషల్ మీడియా వేదికగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తొక్కలోనే అసలైన పోషకాలు: నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జామకాయను తొక్కతో పాటు తినడమే అత్యంత శ్రేయస్కరం. జామ తొక్కలో పొటాషియం, జింక్, విటమిన్ సి వంటి సూక్ష్మపోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారికి వరం: అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు జామకాయను తొక్క తీయకుండా తినడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు నిరూపించాయి. ఇందులోని ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.జామకాయ లబ జామపండు: జామకాయ, పండు రెండింటిలోనూ పోషకాలు ఉన్నప్పటికీ, ఆరోగ్య అవసరాలను బట్టి ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గాలనుకునే వారికి, దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని చూసే వారికి దోర జామకాయ ఉత్తమం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా కాయే మేలు చేస్తుంది.జామపండు: ఇది మృదువుగా, తియ్యగా ఉంటుంది కాబట్టి చిన్న పిల్లలు, వృద్ధులు దీనిని సులభంగా తినవచ్చు. జామపండు త్వరగా జీర్ణమవుతుంది. ఇందులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.వృద్ధులు జామను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉండే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు శరీరంలో వాపులు, మంటను తగ్గిస్తాయి. గుండె సంబంధిత సమస్యలు రాకుండా కాపాడతాయి. మొత్తానికి జామ ఎలా తిన్నా ఆరోగ్యమే.. అయితే మీ శరీర తత్వాన్ని బట్టి, మీకు ఉన్న ఆరోగ్య సమస్యలను బట్టి కాయను ఎంచుకోవాలా లేదా పండును ఎంచుకోవాలా అనేది నిర్ణయించుకోవాలి. ముఖ్యంగా తొక్క తీయకుండా తినడం వల్ల పూర్తిస్థాయి పోషకాలను పొందవచ్చని గుర్తుంచుకోండి.

# టమాటో వీరికి అమృతంతో సమానం



టమాటో రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. విటమిన్ ఏ కంటిచూపును మెరుగుపరుస్తుంది, ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం వంటివి గుండె ఆరోగ్యానికి, రక్తపోటు నియంత్రణకు సహాయపడతాయి. టమాటోలు కేవలం వంటకు రుచిని మాత్రమే కాదు, అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. రోజువారీ ఆహారంలో టమాటాలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. టమాటోలో ఉండే పోషకాలు శరీరానికి చాలా ముఖ్యమైనవి. టమాటోలో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటిచూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్రమం తప్పకుండా టమాటో తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. టమాటోలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా టమాటోలు సహాయపడతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలనుకునే వారికి ప్రయోజనకరం. టమాటోలోని యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి. పొటాషియంతో నిండిన టమాటోలు రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి.

విటమిన్ ఏ, సి, కొల్లాజెన్ సమృద్ధిగా ఉండటం వల్ల టమాటాలు చర్మ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఇవి వృద్ధాప్య సంకేతాలను తగ్గించి, చర్మాన్ని యవ్వనంగా, కాంతివంతంగా ఉంచడంలో తోడ్పడతాయి. టమాటోలను జ్యూస్ రూపంలో లేదా నేరుగా తినడం ద్వారా ఈ ప్రయోజనాలను పొందవచ్చు.

# బ్రెయిన్ సూపర్ యాక్టీవ్‌గా పనిచేయాలా?



మారుతున్న లైఫ్‌స్టైల్, వర్క్ ప్రెజర్ కారణంగా జనాలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిలో జ్ఞాపకశక్తి మందగించడం, మతిమరుపు కూడా ఒకటి. ఈ సమస్యలను పరిష్కరించుకొని బ్రెయిన్ సూపర్ యాక్టీవ్‌గా చేసుకోవాలంటే మన రోజువారి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలని అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌కు చెందిన ప్రఖ్యాత న్యూరో సైంటిస్ట్ దయా గ్రాంట్ చెబుతున్నారు. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో జనాలు రోజు మొత్తం టెన్షన్, పని ఒత్తిడితోనే గడపుతున్నారు. దీనికి తోడు రోజంతా ఫోన్ వాడడం, ఇలా అనేక రకాల పనులతో మన బ్రెయిన్‌కు రెస్ట్ లేకుండా చేస్తున్నారు. దీని వల్ల మతిమరుపు, జ్ఞానపశక్తి మందగించడం, లోచించే శక్తి లోపించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను అదిగమించేందుకు జనాలు అనేక రకాల మందులను వాడుతూ ఉంటారు. కానీ మన జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈజీగా మన బ్రెయిన్‌ను సూపర్ యాక్టీవ్‌గా మార్చుకోవచ్చని న్యూరో సైంటిస్ట్‌లు చెబుతున్నారు. ఈ అలవాట్లు మన బ్రెయిన్‌ను ఎప్పుడూ యాక్టీవ్‌గా ఉండేలా చేస్తాయి అంటున్నారు. మెదడుకు ఫ్రీటైం: న్యూరో సైంటిస్ట్ ప్రకారం రోజంతా మనం పనిలో మునిగిపోవడం, ఫోన్‌లో గడపం వల్ల మన బ్రెయిన్‌పై ఒత్తిడి పెరుగుతుందని.. కాబట్టి దానికి కాస్తా ఫ్రీటైం ఇచ్చేందుకు ప్రతి రోజూ కొద్ది సమయం ప్రకృతిలో గడపాలని చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా ఇది మెదడు ప్రశాంతత దొరికి తనను తాను రీసెట్ చేసుకుంటుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ మీ బ్రెయిన్‌లో కొత్త ఆలోచనలకు సహకరిస్తుందని, అలాగే రోజంతా మీ బ్రయిన్‌ను యాక్టీవ్‌గా ఉంచుతుందని చెబుతున్నారు. స్కిల్స్ పెంచుకోవడం, పజిల్స్ పరిష్కరించడం: మీ బ్రెయిన్ యాక్టీవ్‌గా పనిచేయాలి అంటే మీరు ఎప్పుడూ ఫోన్ పట్టుకొని కూర్చోవడం కాకుండా కొత్త స్కిల్స్ నేర్చుకోవడం, ఫజిల్‌లను పరిష్కరించడం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.అలాగే పియానో వంటి వాటిని నేర్చుకోవాలని సూచిస్తున్నారు. సంగీత వాయిద్యాలను వాయించడం వల్ల మెదడు జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు.ప్రాణాయామం: పని మధ్యలో మానసికంగా అలసిపోయినప్పుడు నాడి శోధన ప్రాణాయామం చేయాలని చూసిస్తున్నారు. ఇందుకోసం ప్రశాంతమైన ప్లేస్‌లో కూర్చొని ఒక ముక్కు రంధ్రాన్ని మూసివేసి, మరొక ముక్కు ద్వారా కొన్ని నిమిషాలు గాలి పీల్చు?కోవాలని చెబుతున్నారు. ఈ సాధారణ చర్య మీ ఏకాగ్రతను పెంచడంతో

పాటు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. న్యూరో సైంటిస్ట్ చెప్పినట్లుగా, మెదడుకు ఎక్కువ పని చేయడం కంటే కొంత విశ్రాంతి మరియు సరైన అలవాట్లను ఇవ్వడం చాలా ముఖ్యం. ప్రతిరోజూ మీ కోసం కొంత సమయం కేటాయించండి, ప్రాణాయామం చేయండి మరియు పాత అలవాట్లకు తిరిగి వెళ్లండి. అప్పుడే మీ మెదడు పదునుగా ఉంటుంది.

# టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విజయంతో టీమిండియాకి ఐసీసీ ట్రోఫీ అందించిన కెప్టెన్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ చేరాడు. ఈ టోర్నమెంట్ తర్వాత అతడు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటాడని, ఆటకు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. న్యూజిలాండ్ పై ఫైనల్లో గెలిచిన తర్వాత ఒలింపిక్స్-2028లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే సూర్య క్లియర్ గా చెప్పేశాడు. కెప్టెన్సీ వ్యవహారంపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇండియన్ టీమ్ టీ20 కెప్టెన్ గా ఎవరూ ఊహించని పేరును ప్రతిపాదించాడు. జట్టులో చోటే లేని ప్లేయర్ కి జట్టు టీమ్ పగ్గాలు ఇవ్వాలని చెప్పడం గమనార్హం. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కి టైటిల్ అందించిన కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. గతేడాది పంజాబ్ కింగ్స్ కి వెళ్లిన ఈ ముంబై బ్యాటర్.. ఆ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. సారథిగా, బ్యాటర్ గా రాణించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయినప్పటికీ శ్రేయస్ ని సెలక్టర్లు పెద్దగా పట్టించుకోలేదు.. అతడు ఫామ్ లో ఉన్నప్పటికీ.. టీమ్ లో మాత్రం చోటు ఇవ్వలేకపోతున్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తేల్చి చెప్పారు. ఆసియా టీ20 కప్-టోర్నీకి జట్టుని ప్రకటించిన సందర్భంగా ఈ కామెంట్స్ చేశారు. ఇక టీ20 వరల్డ్ కప్ - 2026 జట్టులోనూ అయ్యర్ కి స్థానం లభించలేదు.

దేశీయ లీగ్స్, ఐపీఎల్లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్ ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో ఆకాశ్ చోప్రా మాత్రం అయ్యర్ భారత జట్టు టీ20 కెప్టెన్ ఎందుకు కాకూడదంటూ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఐపీఎల్-2026లో పంజాబ్ కింగ్స్ సారథిగా, బ్యాటర్ గా

రాణిస్తే అతడికి మరో ఛాన్స్ దక్కుతుందని అన్నారు. శ్రేయస్ టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉంటాడని నేను అనుకున్నాను.. మిడిలార్డర్ లో ఒకవేళ చోటు ఖాళీ అయితే కచ్చితంగా అది అతడికే దక్కేది అన్నారు. కాబట్టి త్వరలోనే శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టులోకి వచ్చే ఛాన్స్ కనిపిస్తుందన్నారు.ఇక కెప్టెన్సీ విషయానికొస్తే.. ఇండియన్ టీమ్ తదుపరి కెప్టెన్ గా శ్రేయస్ ఎందుకు ఉండకూడదు? అందుకు అవకాశం ఉందని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

# ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్.. టికెట్ల అమ్మకం షెడ్యూల్ రిలీజ్








**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మొదటి దశలో సొంతగడ్డపై జరిగే మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాల షెడ్యూల్‌ను ముంబై ఇండియన్స్ (మార్చి 17న) విడుదల చేసింది. బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ముంబై ఇండియన్స్ తొలి దశలో మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో హోమ్ మ్యాచ్‌తో తమ జర్నీని స్టార్ట్ చేయనుంది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పై ఇతర వేదికల్లో మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత మళ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే కీలక మ్యాచ్ ని వాంఖడే స్టేడియంలో ఆడనుంది.ఈ మ్యాచులకి సంబంధించిన టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో దీశీశీనివీమొష్ట్రశీష వెబ్‌సైట్, యాప్ ద్వారా ఎం-టికెట్ల రూపంలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈసారి టికెట్ల విక్రయాన్ని నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గూగుల్ పే ఉపయోగించే వినియోగదారులకు మార్చి 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి మార్చి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు టికెట్లు బుక్ చేసుకునే ఛాన్స్ కల్పించారు. రెండో దశలో ఎంఐ గోల్డ్, సిల్వర్, జూనియర్ మెంబర్లకు మార్చి 21 మధ్యాహ్నం 3 గంటల నుంచి మార్చి 22 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

మూడో దశలో ఎంఐ బ్లూ మెంబర్లు, ముందుగా రిజిస్టర్ చేసుకున్న దీశీశీనివీమొష్ట్రశీష యూజర్లకు మార్చి 22వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మార్చి 23 సాయంత్రం 5 గంటల వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయి. చివరి దశలో సాధారణ ప్రజలకు మార్చి 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి టికెట్ విక్రయం ప్రారంభమవుతుంది. మెంబర్‌షిప్ ద్వారా ముందస్తు బుకింగ్ సదుపాయం పొందాలంటే, మార్చి 19వ తేదీ రాత్రి 11:59 లోపు మెంబర్‌షిప్ తీసుకోవాలని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ స్పష్టం చేసింది. అభిమానులకు ప్రాధాన్యత కల్పించేందుకు ఈ విధంగా దశలవారీగా టికెట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంప్‌ను స్టార్ట్ చేసింది.

# రాహుల్ ద్రవిడ్ డ్యాన్స్ సూపర్.. నన్ను పార్టీకి పిలవకపోయినా వెళ్లాను..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు భారత మాజీ ఫాస్ట్ బౌలర్ శ్రీశాంత్ తన క్రికెట్ కెరీర్‌లో జరిగిన ఆసక్తికర సంఘటనలను షేర్ చేసుకున్నాడు. ముఖ్యంగా టీమిండియా చేసుకునే పార్టీల గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శ్రీశాంత్ మాట్లాడుతూ.. తమ కాలంలో మ్యాచ్‌లు గెలిచిన తర్వాత ప్లేయర్స్ ఎక్కువగా నైట్ పార్టీల్లో పాల్గొనేవారని చెప్పాడు. సీనియర్ ఆటగాళ్లు మాత్రం త్వరగా నిద్రపోవడాన్ని ఇష్టపడేవారని గుర్తు చేశాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ లాంటి వారు త్వరగా నిద్రపోతారు.. కానీ సౌరభ్ గంగూలీ మాత్రం ఎక్కువగా తన గదిలోనే ఉండేవాడు.. భారీ విజయాలు సాధించినప్పుడు మాత్రం అందరం కలిసి సెలబ్రేట్ చేసుకునేవాళ్లమని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.పాకిస్థాన్‌లోనే పాక్ పై సిరీస్ గెలిచిన సందర్భాన్ని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ గుర్తు చేసుకుంటూ.. ఆ సిరీస్ నా ఫస్ట్ విదేశీ టూర్.. ఆ రోజు మాత్రం అందరం కలిసి రాత్రి పొద్దుపోయే వరకు ఎంజాయ్ చేశాం.. ఈ సందర్భంగా రాహుల్ ద్రవిడ్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. రాహుల్ భాయ్ చాలా బాగా డాన్స్ చేస్తాడు.. ఇది చాలా మందికి తెలియదన్నాడు. మైదానంలో కూల్‌గా, క్రమశిక్షణతో కనిపించే ద్రవిడ్‌కు ఈ టాలెంట్ ఉందని చెప్పడంతో ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, 2008 ఐపీఎల్ ఫైనల్ తర్వాత జరిగిన పార్టీకి నన్ను ఆహ్వానించలేదు, అయినప్పటికీ నేను వెళ్లినట్ల శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ తర్వాత పార్టీ జరిగింది.. ఆ పార్టీకి నాకు ఆహ్వానం లేకపోయినా 'పర్పుల్ క్యాప్' కోసం వెళ్లాను.. షేన్ వార్న్ లాంటి లెజెండ్స్ అక్కడ ఉండడంతో నేను కూడా పార్టీలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఆ సీజన్‌లో శ్రీశాంత్ 19 వికెట్లు తీసుకోగా, పాకిస్థాన్ బౌలర్ సోహైల్ తన్వీర్ 22 వికెట్లతో పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టు షేన్ వార్న్ నాయకత్వంలో టైటిల్ గెలుచుకుంది.

# శంకర్ మళ్లీ లైఫ్ రిస్క్ ప్రాజెక్ట్ చేస్తున్నాడా?



నభా నటేష్
ఎప్పుడూ
మీ కలల్లోనే
ఉంటుంది



ఇండస్ట్రీలో ఎవరి లైఫ్ ఎలాంటి టర్న్ తీసుకుంటుందో ఎలాంటి మలుపులు, కుదుపులకు లోనవుతుందో చెప్పడం కష్టం. ఇప్పుడు అలాంటి ఇబ్బందికర పరిస్థితుల్నే ఎదుర్కొంటున్నారు స్టార్ డైరెక్టర్ శంకర్. తనదైన మార్కు భారీ బడ్జెట్ సినిమాలతో కోలీవుడ్, టాలీవుడ్‌లలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మంచి పాపులారిటీని సొంతం చేసుకుని ఇండియన్ టాప్ డైరెక్టర్లలో ఒకరిగా ఎదిగిన ఆయన ఇప్పుడు మాత్రం చాలా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. -రోబో- వరకు సాఫీగానే సాగిన శంకర్ ప్రయాణం చియాన్ విక్రమ్‌తో చేసిన -ఐ- నుంచి దారి తప్పుతూ కుదుపులకు గురవుతోంది.

భారీ అంచనాల మధ్య చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి శంకర్‌కు షాక్ ఇచ్చింది. ఈ మూవీ ఇచ్చిన షాక్‌కి ఆస్కార్ ఫిల్మ్స్ వి.రవిచంద్రన్ మరో సినిమా చేయలేకపోయారు. కమల్‌తో కలిసి సహ భాగస్వామిగా -విశ్వరూపం- రెండు భాగాలని నిర్మించినా సోలో ప్రొడ్యూసర్‌గా మాత్రం ప్రొడక్షన్ ఆపేసి షాక్ ఇచ్చారు. ఇక ఈ మూవీ తరువాత లైకా ప్రొడక్షన్‌తో కలిసి చేసిన -2.ఓ- ఫరవాలేదు అనిపించినా ఆశించిన లాభాల్ని మాత్రం తెచ్చి పెట్టలేకపోయింది.ఇదే సంస్థలో కలిసి శంకర్ చేసిన -ఇండియన్ 2- వివాదం ఇప్పటికీ శంకర్‌ని వెంటాడుతూనే ఉంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో క్రేన్ యాక్సిడెంట్ జరగడం, అందులో డైరెక్షన్ టీమ్‌కు సంబంధించి నలుగురు వ్యక్తులు మృతి చెందడంతో శంకర్‌కు, లైకాకు మధ్య వివాదం ముదిరి సినిమా ఆగిపోయే దాకా వచ్చింది. -విక్రమ్- సక్సెస్ తరువాత ఉదయనిధి స్టాలిన్‌ని ఒప్పించిన కమల్ లైకా, శంకర్‌ల మధ్య సయోధ్య కుదిర్చి -ఇండియన్ 2-ని పూర్తి చేసి రిలీజ్ చేయించాడు. ఫలితం డిజాస్టర్.ఇదే డిజాస్టర్ అనిపించుకుంటే దీనికి సీక్వెల్ గా -ఇండియన్ 3-ని కూడా అప్పటికే మొదలు పెట్టి మధ్యలో ఆపేశారు. ఇప్పుడు దీన్ని పూర్తి చేసి ఓటీటీకి ఇవ్వడం శంకర్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. దీనిపై లైకా వర్గాలు ఇప్పటికీ శంకర్‌పై గుర్రుగానే ఉన్నారు. దీన్ని పూర్తి చేయకుండా శంకర్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ -వేల్పరి-ని పట్టాలెక్కించాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. అది అంత ఈజీ కాదని తెలుస్తోంది. -ఇండియన్ 3-ని పూర్తి చేయకుండా శంకర్ -వేల్పరి-ని స్టార్ట్ చేస్తే లీగల్ గా ప్రొసీడ్ అవుతామని లైకా వర్గాలు బాహాటంగానే హెచ్చరిస్తున్నాయి.ఈ వివాదాం సద్దుమనగాలంటే శంకర్ -ఇండియన్ 3-ని పూర్తి చేయాల్సిందే. దాన్ని పూర్తి చేసి -వేల్పరి-ని మొదలు పెట్టాలంటే ప్రొడ్యూసర్ ఎవరన్నది ఇప్పుడు శంకర్‌కు ప్రధాన సమస్యగా మారింది. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్‌కు కమిట్ అయ్యే హీరోలు రెండేళ్లు డేట్స్ ఇవ్వాల్సిందే. అలా డేట్స్ ఇచ్చే పరిస్థితిలో ఏ హీరో కనిపించడం లేదు. శంకర్ కాబట్టి ధనుష్ డేట్స్ ఇచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ధనుష్ ఇప్పటికే వరుస ప్రాజెక్ట్‌లని ప్రకటించాడు. ఇళయరాజా బయోపిక్‌తో పాటు అబ్దుల్ కలాం బయోపిక్ కూడా లైన్‌లో ఉంది. అంతే కాకుండా తన 55వ ప్రాజెక్ట్‌ని ఇటీవలే మొదలు పెట్టాడు. అది పూర్తి చేయాలి. -వేల్పరి- ఛారిత్రక నేపథ్యంలో సాగు పీరియాడిక్ మూవీ దీనికి భారీ సెట్స్ తో పాటు భారీ బడ్జెట్ చాలా అవసరం. శంకర్ ప్రస్తుత రికార్డ్‌ని బట్టి ఇంత వరకు ఏ ప్రొడ్యూసర్ కూడా ముందుకు రాలేదు. దీంతో శంకర్ -వేల్పరి- అంటూ మరో తలనొప్పిని నెత్తికి ఎత్తుకుంటున్నాడని కోలీవుడ్‌లో కామెంట్‌లు వినిపిస్తున్నాయి.



జాన్వీ కపూర్
ఆరాధన
కంటే తక్కువ
కాదు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965